TRBoIL A13L
C

CT

TRB01 A131

తేజోరేఖలు

సంజీవదేవ్

★

I

తెలుగు కథలు

సంజీవదేవ్

హేచ్ బుక్ డిస్ట్రిబ్యూటర్సు
చరిత్ర బిల్డింగ్సు: విజయవాడ-2

చేతి ప్రచురణ
ప్రథమ ముద్రణ
ఏప్రియల్ 1965



దేశిప్రెస్, విజయవాడ-2
మూడు రూపాయలు

అర్పణ

'తేటి గీతలు' మౌలిక రూపకల్పన
చెందటానికి పరోక్ష కారకులైన

బావ వేణుగోపాలరావుకూ,
అక్క కృష్ణా బాయికీ
ప్రేమాంజలితో

—సంజీవదేవ్

కృతజ్ఞత :

'తేజోరేఖలు' ధారావాహికంగా 'భారతి' లో వెలువడినవి. వీటిని గ్రంధరూపంలో వెలువర్చటకు అనుమతించిన 'భారతి' సంపాదకులకు ఆంతరిక కృతజ్ఞత.

నా పథ్యం లా

"తేజోరేఖలు" గద్య కవితలు కావు; పద్యకవితలు అంతకంటే కావు. ఇవి విషయాన్ని విశదపరచే భావాలు మాత్రమే.

కవితకు అస్పష్టత అవసరం; ఆలోచనా రచనకు సుస్పష్టత అవసరం. 'తేజోరేఖలు' ఈ రెండో వర్గానికి చెందుతవి. వీటిలో రస సృష్టికంటే అర్థపుష్టి ప్రధానం. లక్షణమూ (Connotation), వ్యంజనమూ (Suggestion) కంటే అభిధ (denotation) కే ఇటువంటి రచనల్లో ప్రాముఖ్యత అవసరం.

భావం లేని శబ్దం వుంటుంది కాని శబ్దం లేని భావం వుండదు. ఎంతటి అమూర్త (abstract) భావంకూడ శబ్దాన్నుంచి వేరుగా ప్రత్యక్షం కాజాలదు. ఈ సత్యం వ్రాసే

టప్పుడూ, ఉచ్చరించేటప్పుడు మాత్రమేకాక
భావించేటప్పుడు కూడ చిర ప్రత్యక్షమే.

భావిస్తున్నప్పుడు కూడ ప్రతిభావమూ ఏదో
ఒక శబ్దరూపాన్ని కప్పుకోకుండా నగ్నంగా
వెలువడే అవకాశం లేదు. ఇటువంటి అవ
కాశం అర్థాలుగల భావానికీ, లేక ఆలోచనకూ
వుండదు కాని అర్థాలు లేని అనుభూతికి
వుంటుంది. శబ్దాభాసతో పని లేకుండానే
అమూర్తమైన అనుభూతిని చెందవచ్చు.

శబ్దం లేంది భావం రూపం తాల్చదు కనుక
భావాని కెంత విలువో శబ్దానికి కూడా అంత
విలువ. భావాన్ని వ్యక్తపరుస్తూ అవసరమైన
శబ్దాన్ని వదలినా, అనవసరమైన శబ్దాన్ని
చేర్చినా, అందులోని అర్థం యదార్థాన్ని
కోల్పోయి అపార్థంగా మారి అనర్థాన్ని
సృష్టిస్తుంది.

ఆ

అయితే, కొన్నివిధాల భావాల్ని వ్యక్తం చేయటానికి కొన్నివిధాల శబ్దాలు సరిపోవు. అటువంటప్పుడు వాడుకలో లేని కొత్తకొత్త శబ్దాలను వాడవలసివుంటుంది. ఇటువంటి కొత్తకొత్త శబ్దాలు వాడినప్పుడు ఆ శబ్దాలు భావాన్ని సువ్యక్తపరచటానికి బదులు అవ్యక్త పరిచే ప్రమాదం కూడ లేకపోలేదు. కొన్ని శబ్దాలు భావాన్ని దాచటానికే బాగా ఉపయుక్తమవుతవి.

'తేజోరేఖలు' లో మట్టికి సంబంధించని అమూర్త జగత్తుకు సంబంధించిన భావాలతో పాటు మట్టికి సంబంధించిన మూర్త జగత్తు సంబంధమైన భావాలుకూడ సమంగా ఉన్నవి. ప్రేమ, కరుణ, అనురక్తి, విరక్తి, ఆనందం, కర్మ, జన్మ, పునర్జన్మ మొదలైనవాటితోపాటు ఎండా, గాలీ, మంచూ, వెన్నెలా, వర్షమూ,

కొండలూ, కోనలూ, దుమ్మూ ధూళీ కూడ
ఇందులో సహజీవనాన్ని పొందినవి.

ఈ రేఖల ఆవిర్భావానికి ఒక చిన్న నేపథ్యగాథ వున్నది. ఆంధ్ర విశ్వవిద్యాలయపు ఇంజనీరింగ్ కాలేజీలో రీడర్‌గా వుంటూన్న బావ వేణుగోపాలరావు (అక్క కృష్ణాబాయి భర్త) అమెరికాలోవుండి నా కో మంచి బొమ్మల డైరీ పంపటం జరిగింది. దానిలో నేను ఇంగ్లీషులో కొన్ని భావాలు అప్పుడప్పుడు వ్రాసుకొంటూ వచ్చాను. ఈ 'తేజోరేఖలు' నా స్వంత ఇంగ్లీషు నుంచి నేను చేసుకొన్న ఛాయారూపాలు. అందుకే ఇందులోని వాక్య నిర్మాణంలో తెలుగు నుడికారం పూర్ణానుస్వారమే!

—సంజీవదేవ్

తేజోరేఖలు

పరిచితంకాని దాని ద్వారా పరిచితమైన దాన్ని వర్ణించి చూపటం వృథా. అందుకు విరుద్ధంగా పరిచితంకాని దాన్ని పరిచితమైన దాని ద్వారా వర్ణించటం సముచితం. అజ్ఞాతం ఎప్పుడూ జ్ఞాతసాదృశ్యంద్వారా తెలియబడాలనుంటుంది. ఇంద్రియగ్రాహ్యంద్వారా అతీంద్రియం గ్రహించబడాలి. మూర్తం ద్వారా అమూర్తం.

*　　*　　*

స్థలంలో మనం వెనక్కు పోగలం గాని కాలంలో వెనక్కు పోజాలం. మన స్మృతులలో మాత్రమే మనం కాలంలో వెనక్కు పోగలం, కాని స్థలంలో మాత్రం శరీరంతోకూడా వెనక్కు

పోగలం. స్థలంలో మనం పోగలంవెనక్కు, పోగలం మధ్యకు, పోగలం ముందుకు. కాని, కాలంలో మాత్రం మనం మధ్యకూ, ముందుకూ మాత్రమే పోగలం, మధ్య అనేది వర్తమానాన్ని, ముందు అనేది భవిష్యత్తునూ సూచిస్తవి కనుక. అందుకని మనం కాలంలో వెనక్కు పోజాలం, వెనక అనేది భూతకాలం కనుక.

స్థలం స్థితిశీలం (పైకి మాత్రమే; అసలు లోతుకుపోతే ఈ విశ్వ సృష్టిలో ఏదీ స్థితిశీలం కాదు; అంతా గతిశీలమే) కాలం గతిశీలం. స్థలం దృశ్యమానం, కాలం శ్రవ్యమానం. కనుక రూపం స్థలాత్మకం, నాదం కాలాత్మకం. స్థలం మూర్తం, కాలం అమూర్తం. స్థలంభావం (Being) కాలం భవం (Becoming)

* * *

శరత్ ఎంతో ఆనందమయ కాలం; పైన పారదర్శికంగా పెలుగుతూన్న నీల గగనం, క్రింద స్ఫటిక స్వచ్ఛమైన నీల జలమూ, వాటి మధ్య హేమధవళమైన గెల్లుపూలు పైన సీలంలోనీ,

క్రిందీ నీలంలోనీ ఏకత్వపు విసుగుదలను తొలగిస్తవి.
ఎగురుతూన్నట్టీ, ఎగురుతూండడనట్టీ కొంగల
తెల్లదనం రెల్లుపూల తెల్లదనాన్ని ప్రస్ఫుటం
చేస్తూంది. ప్రత్యేకించి రసమయ చిన్మయ సాధనలో
ఆసక్తి కలవాళ్ళకు శరత్ నిజంగా అద్భుతమైన
ప్రేరణాత్మక ఋతువు. చిన్మయమైన శారద
ప్రభాతాలూ, తన్మయమైన శారద సంధ్యలూ
సజీవంగా సురబాలలు కూడ ఆనందించే విచిత్ర
దృశ్యాలు!

* * *

అన్ని కళల కంటె జీవితం మహోన్నత
మైనట్టీ, లలితతమమైనట్టీ కళ, సందేహంలేదు.
అయినా, ఇతర సృజనాత్మక కళలు లేనప్పుడు
జీవితం తన స్వంత కళను ఆనందించ జాలదు.
వర్ణం, నాదం, ఛందం, గతి మొదలైన వాటి
లయ అనే దర్పణంలోకాని జీవితం తన స్వంత
కళలోని మాధుర్యాన్ని అనుభూతి చెందజాలదు.

* * *

జీన్‌పాల్ సార్త్రే తన స్వంత ఎగ్జిస్టెంషలిస్టు ధోరణిలో అంటాడు 'ఏది ఉన్నదో అది లేదు.' (etre - neant) అని. ఇది అద్వైత సిద్ధాంతంలాగా, జపానీయుల జన్ సిద్ధాంతంలాగా, నాగార్జునుని తర్కంలాగా బహు విచిత్రంగా ధ్వనిస్తుంది.

* * *

జీవితం కళను సజీవపరుస్తుంది. కళ జీవితాన్ని ఆనందపరుస్తుంది. జీవితం వ్యక్తపరుస్తుంది. కళ గుప్తపరుస్తుంది. ఈ విధంగా కళ బహిర్గతం కంటే అంతర్గతమే అధికం.

* * *

ప్రయాణం ప్రేరణలేని వాళ్ళకు ప్రేరణనిస్తుంది. జడునిలో ఉద్రేకాన్ని కలిగిస్తుంది ప్రయాణం. ప్రయాణం మందమతిలో నవజీవన సుధను పోస్తుంది. జ్ఞానోదయానికి ప్రయాణం ఒక జయప్రద మార్గం. విద్య తన పరిపూర్ణతను అందుకొంటుంది ప్రయాణంలో.

ఇక ప్రయాణపు గమ్యస్థానం ఆనందానికీ, శాంతికీ నిలయమై, అక్కడి నివాసులు మానవత్వం లోని మంచితనానికంతకూ సజీవమూర్తులై ఉంటే, ఇక అటువంటి ప్రయాణము నిరుపమేయం అవుతుంది.

* * *

పదం వస్తువు కాదు. వస్తువుయొక్క శబ్ద చిహ్నం మాత్రమే పదం. పదం నామం, వస్తువు రూపం. 'పుష్పం' అనే పదం నిజంగా పుష్పం కాదు, అది కేవలం పుష్పానికి శబ్దచిహ్నం మాత్రమే. 'పుష్పం' అనే పదానికి వాస్తవపుష్పాని కున్న రంగుకాని సుగంధంకాని లేదు. అయినప్పటికీ పుష్పం అనే పదం మనలో సృష్టిస్తుంది వాస్తవ పుష్పంలోని రంగూ సుగంధాల సంవేదనలను. ఈ విధంగా చూస్తే వాస్తవ వస్తువుకూ, దాని చిహ్నానికీ మధ్య ఎక్కువప్రభేదం లేదేమో అనిపిస్తుంది.

పదం ఛాయ అనీ, వస్తువు వాస్తవ పదార్థమనీ వాడుక. పుష్పం అసలు పదార్థం అనీ, 'పుష్పం'అనే పదం దాని ఛాయ అనీ. కానీ పదమే

వాస్తవ పదార్థమేమో 'పుష్పమే' దాని ఛాయ యేమో, ఎవ రెరుగు! నిజంగా ఇది గుర్రాన్ని బండి లాగుతుందన్నట్లుంటుంది!! ఒక వస్తువ్రయొక్క పదం ఆ వస్తువు కంటే ఎక్కువ చిరస్థాయిగా ఉంటుంది. రూపం నశిస్తుంది, నామం నిలుస్తుంది. పుష్పం నశిస్తుంది కాని 'పుష్పం' అనే పేరు నశించదు. కనుక ఒక వస్తువ్రకంటే ఆ వస్తువును సూచించే చిహ్నమే ఎక్కువ శాశ్వతం పదార్థాని కంటే దాని ఛాయనే ఎక్కువ చిరస్థాయి!

నామం రూపం కాదు, పదం తాను సూచిస్తూన్న వస్తువ్రూ కాదు. 'పుష్పం' అనే పదాన్ని ఉచ్చరించినంతమాత్రాన వాస్తవ పుష్పాన్ని క్షణిగి వుండటం కాజాలదు. మానవ జాతికి ఇది మేలూ, కీడూ రెండూ కూడ. మనకు ఇష్టమైన వస్తువు పేరును ఉచ్చరించటంతో ఆ పేరు వెంటనే వస్తువ్రుగా మారితే అది మనకు మేలు. అయితే యిది అయిష్టమైన వస్తువ్ర విషయంలో మాత్రం వర్తించిందా అంటే మాత్రం మనకు కీడే!

'ఆరోగ్యం', 'జీవనం' అనే పదాలను మనం ఉచ్చరించినప్పుడు అవి ప్రత్యక్ష మవటం మేలు. కాని, 'వ్యాధి', 'మరణం' అనే పదాలను ఉచ్చ

రించినప్పుడు అవి ప్రత్యక్షమవటం మాత్రం ఎంతో కీడు! కాని అదృష్టవశాత్తు పదం అనేది కేవలం వస్తువుయొక్క చిహ్నంగా ఉండటం మాత్రమే జరుగుతూంది, ఆ వస్తువుగా వుండటం మాత్రం జరగటంలేదు!

*　　*　　*

మన అంతరంగ జీవితం ఎల్లప్పుడూ బహిరంగ జీవితపు ప్రభావం నుంచి వేరై ఉండజాలదు. మనం ఎన్ని ప్రయత్నించినా అది బహిరంగ ప్రభావాలకు తరచుగా లొంగే ఉంటుంది. కాని, దాన్ని బహిరంగ ప్రభావాల నుంచి ఎప్పటికీ వేరుగా ఉంచటానికి అవకాశాలున్నవి.

*　　*　　*

తెలుసుకోటానికంటే అనుభూతి చెందటం జీవితంతో ఎక్కువ సన్నిహితమై ఉంటుంది. తెలుసుకోటం భోగట్టా, అనుభూతిచెందటం ప్రేగణ. తెలుసుకోటం జ్ఞానం, అనుభూతి చెందటం

అనుభవం, ఈ రెండూ కలిసి ప్రజ్ఞానాన్ని తయారు చేస్తవి.

* * *

మానసం ఆనందంగా కాని, విచారంగా కాని లేనప్పుడు అది ఒక తటస్థావస్థలో ఉంటుంది. దీన్నే మనోమాంద్యం అనొచ్చు. ఇటువంటి మాంద్యానికంటె విచారం ఎంతో నయం. నిజానికి విచారానికంటె ఆనందం ఎంతో మంచిదే. అయినా, ఒక తాత్వికుడు అంటాడు- 'పవిత్రమైన దుఃఖం ఆనందానికంటె శ్రేష్ఠమయింది' అని.

* * *

వర్తమానకాలం మిగతా కాలాలైన భూత భవిష్యత్‌ల కంటే చాలా ఉత్కృష్టమైన సజీవకాలం. అయితే, అంతమాత్రాన భూత కాలం మరణించీ లేదు, భవిష్యత్ ఆవిర్భవించ కుండానూ లేదు. వాస్తవానికి వర్తమానం అనేదే లేదు. వర్తమానం అనేది వర్తమానంగా నిలవ లేని ఒక అస్థిరత. అది ప్రతి క్షణమూ భూత కాలంలోకి మారుతూంటుంది. దాని ప్రతిక్షణమూ

భవిష్యత్‌లోని విచిత్రమైన తెరల వెనుక దాగి ఉంటుంది. వర్తమానకాలం నిన్నటి రోజున భవిష్యత్ కాలంలో లెక్క, రేపటి రోజున భూత కాలంలో లెక్క. అది నేడు మాత్రమే, నేడుకూడ గడుస్తూన్న క్షణంలో మాత్రమే వర్తమానం.

* * * *

శీతకాలంలో ఆకాశం అంతా మేఘాలు క్రమ్మినవుంటే బావుండదు. శీతకాలానికి శోభ నిచ్చే స్వచ్ఛ నీలాకాశమూ, నులివెచ్చగా ప్రకాశించే వెండి ఎండా, ఈ రెండూ మేఘాల చాటున మరుగుపడితే ఇంకా శీతకాలపు ఆనంద మేమి వుంటుంది! కారుమేఘాల ఆనందమల్లా వర్ష ఋతువులోనే.

మన మానసికావస్థమీద వాతావరణం లోని మార్పుల ప్రభావం ఎంతగానో పడుతుంది అది మన మానసాన్ని కృంగదీస్తుంది, పై కెత్తుతుంది, బాధపెడుతుంది, ఆనందపరుస్తుంది. కాని, ఈ ప్రాకృతిక ప్రభావాలను అధిగమించ కలిగినప్పుడు మనం ధన్యుల మవుతాం. శీతకాలపు మేఘాలు ఆనందం ప్రసాదించజాలవు. కాని, శీత కాలపు వర్షం మాత్రం ఒక విధమైన ఆనందా

న్నిస్తుంది. శీతకాలంలోని వర్ష దృశ్యం రంగు లోనూ, రూపంలోనూ కూడ ఏదో మనోహరంగా గోచరిసుంది. అకాలపు విశేషాలు ఒక విలక్షణ మైన ఆకర్షణ కలిగి ఉంటవి. శీతకాలపు వర్ష దృశ్యం జపాన్ ప్రకృతి శిల్పి హిరోషిగే చిత్రించే ఆనందంతో కూడిన విషాద చిత్రాల్ని జ్ఞప్తికి తెస్తూంటవి.

కళ ప్రకృతిని అనుకరిస్తుందా లేక ప్రకృతే కళను అనుకరిస్తుందా అనేది అంత ప్రాముఖ్యం కాదు. కావలసిందల్లా కళలోనూ, ప్రకృతిలోనూ గోచరించే రంగులకూ, రూపాలకూ, రచనా చమత్కారానికీ మనం ఎంతవరకు రసవంతంగా చలిస్తామా అనేది! ప్రకృతి కళను అనుకరిస్తుంది. ఎందుకంటే కళ ప్రకృతిని అనుకరిస్తుంది కనుక!

* * *

కళ మానవ నిర్మితం అనీ, మానవుడు సమాజ నిర్మితం అనీ, కనుక కళ సమాజ నిర్మితం అనీ అంటారు. ఈ క్రమాన్ని మనం తలక్రిందులు ఎందుకు చేయకూడదు? సమాజం మానవ నిర్మితం, మానవుడు కళా నిర్మితం—కనుక సమాజం కళా

నిర్మితం అని ఎందుకు కాకూడదా అని ! ఈ తల క్రింపుల క్రమం మొదటిదానికంటే ఎక్కువ సహజ మెనదేమో అనిపిస్తుంది.

* * *

పుస్తకాలన్నిటికంటే ఆత్మకథలూ, స్వీయ సంస్మరణలూ, ప్రత్యేకించి సంస్కృతి రంగానికి చెందిన వ్యక్తులు—సాహితీజీవులూ, చిత్రకారులూ, సంగీత శిల్పులూ, తత్వవేత్తలూ, మర్మసాధకులూ, అన్వేషకులూ, సమీక్షకులూ, రసజ్ఞులూ, వైజ్ఞానికులూ మొదలైనవారు రచించినవి ఎక్కువ అభిరుచికరంగా ఉంటవి. ఇటువంటి రచనలు వ్యక్తి జీవితానికి సంబంధించినవి కనుక అవి వ్యక్తిగత మాధుర్యాన్ని కలిగి ఉంటవి. రచయితల యితర రచనలు కూడ రుచివంతంగానే ఉంటవి. కాని వారి జీవితాల వ్యక్తిగత వివరాలు అన్నిటికంటే ఎక్కువ మనోహరంగా ఉంటవి.

* * *

దూర ప్రాచ్యపు జన్ ఆచార్యులు అంటారు— "సాగిపోతూన్న ప్రతి క్షణంయొక్క—

హృదయంలోనూ జీవనజ్వాల ప్రజ్వలిస్తూంటుంది" అని. ఆ జ్వాలను అందుకోటంలోనే మానవుని లక్ష్యసిద్ధి యిమిడుంది. దాన్ని అందుకోటంలో వైఫల్యం సంభవించినా ఆ వైఫల్యమే ఒక గొప్ప కార్యసిద్ధి!

* * *

కోరికల్ని పెంచుకోటం మధురంగానే ఉంటుంది, సందేహము లేదు. కాని, అదేసమయాన కోరికలు ఫలించక పోయినా కూడ మధురతరంగా ఉండటం నేర్చుకోవాలి. లేనిచో బాధ తప్పదు.

* * *

మృత్యువు ఒకఅద్భుతసంఘటన జీవితంలో. మానవుడు తన స్వంత మరణాన్ని గురించి అది జరగకముందే బాధపడతాడు. అదేవిధంగా ఇతరుల మరణాన్ని గురించి అది జరిగిన తర్వాత బాధపడతాడు.

* * *

మృత్యు రహస్యాన్ని ఇంతవరకూ ఏ వైజ్ఞానికుడు కాని, తత్వవేత్త కాని సక్రమంగా ఉన్మీలన చేయలేదు. మరణం ఒక మహా రహస్య మైతే జీవనం ఒక మహత్తర రహస్యం!

* * *

జీవితం గద్యాత్మకమైన ముడిపదార్థం; దాన్ని మనం ఆనందపు లయతోను, శాంతి యొక్క ప్రాసతోను, ప్రతిధ్వనించే కవితా ఖండంలోకి రూపాంతర పరచాలి. అప్పుడు కాని జీవితం ఒక కాంతి గీతగా మారదు. దానిముందు దుఃఖాల నీడలు నిలవలేవు. జీవితం కాంతి అయినపుడు మరణం శాంతి అవుతుంది.

* * *

మార్పులేని ఏక రీతి జీవితంలో ఒక వ్యతిరేక శక్తి. అది జీవితంలోని ఆనందాన్ని నిస్తేజ పరుస్తుంది. జీవించటంలో ఉండే అభిరుచినంతా చప్పపరుస్తుంది. ఆలోచనలోనూ, అనుభూతిలోనూ సాగే ప్రగతినంతా స్థగితం చేస్తుంది.

ఏకరీతి (monotony) అనేది రెండు విధాలు—వ్యక్తిగతం, వస్తుగతం. వ్యక్తిగత ఏకరీతి అనేది ఒక మానసిక లోపం. ఇది నూతన పరిసరాలలో కూడ నూతనత్వాన్ని చూడలేదు. కారణం, జీవితంలోని అనేక తెలిసీ తెలియని కారణాలవల్ల వ్యక్తిలోని సంవేదనాత్మక గ్రహణ శీలత స్తబ్ధం అయిపోతుంది. కాని, వస్తుగత ఏకరీతి వ్యక్తికి ఇటువంటి మానసిక లోపాలనేమీ ఆరోపించక ఆ లోపా లన్నిటినీ తనకే ఆరోపించు కుంటుంది. తనను ఆనందపరిచే నూతన పరివర్తన ఆ పరిసరంలో ఏమీ కనిపించని కారణంచేత మనిషి ఈ వస్తుగత ఏకరీతివల్ల బాధ పడతాడు. కాని, తనకు ఆనందప్రదంకాని పరిసరాల నుంచి కూడ మానవుడు ఆనందం పొందటం నేర్చుకొంటే బాధలేదు.

* * *

అంతర్ముఖులు కావటం, కొండలూ, కోనలూ, అడవులూ, సెలయేళ్ళూ గల ఏకాంతంలో నివసించటం, దేహానికి చెందని ఆనందాన్ని అన్వేషించటం, ఇవన్నీ వాస్తవ జీవితంనుంచి

తప్పుకునే పలాయనవాదం కాదు. ఇవే పలాయన వాదం అయితే సంగీతమూ, కవిత్వమూ, నృత్యమూ, నాట్యమూ, చిత్రరచనా, శిల్పమూ మొదలైనవన్నీ కూడ పలాయనవాదంలోనే లెక్క. వీటన్నిటికంటే మించిన పలాయనవాదం మరణం. ఇవన్నీ లేకుండా మానవుడెప్పుడూ జీవించలేదు. పైగా ఇవన్నీ లేకుండా జీవించాలని ప్రయత్నించటమే అన్నిటికంటే గొప్ప పలాయనవాదం !

*　　*　　*

కొందరు తాము నేర్చుకొన్నదాన్ని మరచిపోతారు. మరి కొందరు జ్ఞాపకం ఉంచుకొంటారు. కొందరు తాము నేర్చుకొన్న దానికంటే ఎక్కువ మరచిపోయే వారున్నారు. ఇదే విధంగా కొందరు తాము నేర్చుకొన్న దానికంటే ఎక్కువ జ్ఞాపకం ఉంచుకొనేవారున్నారు. ఈ నాలుగు విధాలలోనే తాను నేర్చుకున్నదాని కంటే ఎక్కువ జ్ఞాపకం ఉంచుకోవటం అన్నిటి కంటే గొప్ప మానసికశక్తి. జీవితంలోని అన్ని రంగాలలోనూ ఇది మహత్తర పరదాసం. సృజ

నాత్మక మూలికతకూ, త్వరిత కల్పనకూ, వక్తృత్వ శక్తి మొదలై నవాటికి ఇది బలమైన మూలం. నేర్చుకున్నదాని కంటే మించి జ్ఞాపకం ఉంచు కోవటం మానస కాంతిలోని ఒక తేజో కిరణం.

* * *

లోకోత్తరమైందనీ, లౌకికమైందనీ ఆత్మిక మైందనీ, భౌతికమైందనీ, ఐహికమైందనీ, ఆముష్మికమైందనీ అనబడే వాటిమధ్య ఒక సరిహద్దు గీత గీయాలని చూస్తారు చాలామంది. ఇటువంటి సరిహద్దు గీత ఎల్లప్పుడూ అంత క్షేమ మైందికాదు. ఆనందమయ, ధ్యానమయ, జ్ఞానమయ జీవితాన్ని గడపటానికి భౌతిక ఆత్మిక సమన్వయ సత్తాను గ్రహించే ఒక సమగ్ర దృష్టి ఒక అపరోక్షానుభూతి, ఒక ప్రాణమయ సాధన అవసరం.

వెలుగు నీడల, జీవన్మరణాల యీ జగత్తులో ఏది ప్రాపంచికం కాదు. ప్రతిదీ పావనమే, ప్రతిదీ ఆత్మికమే. ఏ కార్యమూ అపవిత్రం కాదు;

ఏ విషయమూ మాయ కాదు. ప్రతి కార్యమూ ఆత్మార్పణమే, ప్రతి విషయమూ వాస్తవమే.

ఆధ్యాత్మిక జీవితాన్ని విశ్లేషణాత్మక దృక్పథంతో సమీపిస్తే చిక్కు; సంశ్లేషణనే అలవరచుకోవాలి. ఈ విధానంలో దుఃఖాన్ని దుఃఖంగా అనుభవించక ఆనందంగా అనుభవించటం, బాధను బాధగా కాక సౌఖ్యంగా, మరణాన్ని మరణం వలె కాక జీవనం వలె అనుభూతి చెందటం ప్రధానం.

* * *

ఒకోసారి కొన్ని నిరీక్షణలు పూర్తిగా వాస్తవ రూపం తాలుస్తవి. ఆ రోజు (17-11-62) ఆల్డస్ హక్స్‌లీనుంచి తప్పకుండా ఉత్తరం వస్తుందని నేను గట్టిగా నిరీక్షించాను. అందుకని ఆయనకు నా ఉత్తరంతోపాటు పంపేనిమిత్తం సూక్ష్మ రూపాలలో (2 అం. 1 అం.) కొన్ని ప్రకృతి దృశ్యాలను నీటి రంగులలో చిత్రించాను. ఆశ్చర్యం ! నేను వాటిని ముగించానో లేదో హక్స్‌లీ నుంచి ఉత్తరం రానే వచ్చింది ! ఇటు వంటి నిరీక్షణలను సాధారణంగా దివ్య నిరీక్షణలు అంటారు. ఎక్కువమంది జీవితాలలో ఇటువంటి

నిరీక్షణలు చాలా తక్కువగా ఉంటవి. తక్కువ మంది జీవితాలలో ఎక్కువగా ఉంటవి.

* * *

కల్పనలేని ప్రతిమలు కేవలం లక్ష బొమ్మలు మాత్రమే అవుతవి. కల్పన భౌతిక రూపంలో గడ్డకట్టినపుడు అది ప్రతిమగా మారుతుంది; ప్రతిమ నైరూప్యంలోకి కరగిపోయినప్పుడు అది కల్పనగా మారుతుంది. ప్రతిమ రూపొందకముందు అది ఒక కల్పనే. రూపొందిన తరువాత కూడ మళ్ళీ అది ఒక కల్పనే అవుతుంది. ప్రతిమ జన్మించక ముందున్న కల్పన ఆ ప్రతిమను సృజించిన వ్యక్తిలో ఉంటుంది. అది జన్మించిన తరువాత ఉండే కల్పన దాన్ని చూచి ఆనందించే వ్యక్తిలో ఉంటుంది. ప్రష్టలో కల్పన ప్రతిమగా రూపాంతరం చెందితే ఆ ప్రతిమ తిరిగి సహృదయునిలో కల్పనగా రూపాంతరం చెందుతుంది !

* * *

జీవించటం అంటే ప్రేమించటమే. తాను జీవించటం మాత్రమే జీవించటం కాదు, ఇతర్లను

జీవించ చేసినపుడే నిజంగా తాను జీవించటం అవుతుంది. అప్పుడే జీవించటం అంటే ప్రేమించటం అవుతుంది. ప్రేమగల జీవితం జీవితంమీది ప్రేమకంటే గొప్పది. జీవితం వ్యావహారికమైంది. జీవితపు ప్రమిదమీద ప్రేమజ్వాల వెలుగుతుంది ప్రోజ్వాల రూపంలో.

* * *

గద్యం అనేది ఆలోచన, పద్యం అనేది అనుభూతి. సంగీతం అనేది సంవేదన. మౌనం అనేది తన్మాయత. గద్యం అభివ్యక్తపరచలేని దాన్ని పద్యం, పద్యం అభివ్యక్తపరచలేనిదాన్ని సంగీతం, సంగీతం అభివ్యక్తపరచలేని దాన్ని మౌనం అభివ్యక్త పరుస్తవి. గద్యం భోగట్టా నిస్తుంది. పద్యం ప్రేరణనిస్తుంది. సంగీతం ఇస్తుంది. రసానందాన్ని, మౌనం ప్రసాదిస్తుంది పారవశ్యాన్ని. అర్థాలుగల శబ్దాలు గద్యాన్ని నిర్మిస్తవి. సగం అర్థాలుగల శబ్దాలు పద్యాన్ని, అర్థాలులేని శబ్దాలు సంగీతాన్ని, శబ్దాలులేని నిశ్శబ్దం మౌనాన్ని సృష్టిస్తవి. గద్యం అనేది భూమి, పద్యం అనేది మేఘం, సంగీతం అనేది

ఇంద్రధనస్సు, మౌనం అనేది ఆకాశం. ఈ నాలుగూ సమాన ప్రాముఖ్యత కలవే.

* * *

ఉండటం అంటే లేకపోవటం కూడా. కాంతి ఉండటం అంటే చీకటి లేకపోవటం అవుతుంది. జ్ఞానం ఉన్నదీ అంటే అజ్ఞానం లేదనే. సంపద ఉండటం అంటే దారిద్ర్యం లేకపోవటమే.

ఇదేవిధంగా లేదు అనేది ఉండటమే అవుతుంది. శాస్త్రీయత లేదు అంటే అశాస్త్రీయత ఉండటమే. వర్షాలు లేకపోవటం అంటే వరుపు ఉండటం అనే. బలం లేదంటే దౌర్బల్యం ఉన్నదనే.

ఉండటం అంటే ఉండటమే. శాంతి ఉన్నదంటే సౌఖ్యం ఉన్నదనే. రసానుభూతి ఉండటం అంటే సహృదయత ఉండటమే. నిర్భయత ఉన్నదంటే స్వేచ్ఛ ఉన్నదనే.

లేకపోవటం అంటే లేకపోవటమే. ఆలోచన లేదు అంటే మేధ లేదనే. మేఘం లేదు అంటే వర్షం లేదనే. అహం లేదు అంటే స్వార్థం లేదనే.

ఉండటం లేకపోవటం కలిసి సహజీవనం వేయగలవు. తత్వం తెలిసిన వానికి కవిత్వం తెలియకపోవచ్చు. ఖగోళం తెలిసినవానికి గందర గోళం తెలియకపోవచ్చు. విద్య వచ్చినవానికి వైద్యం రాకపోవచ్చు. కనుక ఒక దాని జ్ఞానం, మరొకదాని అజ్ఞానం ఒకే వ్యక్తితో సహ జీవించగలవు.

* * *

తెరచాప పడవను నడుపుతుంది నీటిమీద. పడవకూడ తెరచాపను నడుపుతుంది; కానట్లయితే తెరచాప పడవను కదిలించలేదు. కొన్ని నిమిషాల క్రితం తెరచాప వంతెనదగ్గర ఉన్నది కాని ఇప్పు డది వంతెనదాటి కొంత దూరాన ఉన్నది. పడవ కదలకపోతే తెరచాప అంత దూరానికి ఏ విధంగా చేరేది? తెరచాప పడవను కదిలించకపోయినా కూడ పడవ అక్కడికి చేరి ఉండేది కాదు! తెర చాప తనంత తాను ఒక చోటినుంచి మరో చోటికి పడవ సహాయం లేకుండా నడవలేదు. అయినప్పటికీ తెరచాప పడవను నడుపుతుంది!

* * *

బుద్ధి జీవులు కాయకష్టానికి భయపడి దానున్నంచి దూరంగా తొలగిఉంటారని వాడుక. కాని ఈ భావన సత్య దూరమైంది. బుద్ధి జీవి— నవలాకారుడు, కవి, వ్యాసకర్త మొదలై నవారు— తన చేతితో కష్టం చేయకుండా కేవలం ఆలో చనతో మాత్రమే తన కృతిని ఎప్పుడూ నిర్మించ లేడు. బుద్ధిజీవి కలంతో కాని, కైపు యంత్రంతో కాని తన చేతిని ఉపయోగించి పనిచేస్తేనే తన రచనా నిర్మాణం జరిగేది. ఇక చిత్రకారుడు తన మనోకల్పనకు భౌతిక రూపం ఇవ్వటానికి ఎంతో శారీరక శ్రమ పడాలి. ఇక యీ కాయకష్టం మూర్తి శిల్పిలో ఎంతో ఎక్కువ మోతాదులో పనిచేస్తుంది, అతని అనుభూతుల్ని ఆకారాల్లోకి మార్చటానికి.

బుద్ధి జీవితం అనేది కేవలం బుద్ధితో మాత్రమే సాగదు కాయకష్టంలేకుండా. అది దంతపు సౌధాలను చాలాదూరం. సూక్ష్మాతి సూక్ష్మమైన భావం కఠినాతి కఠినమైన శ్రమ ద్వారా కాని భౌతిక రూపాన్ని పొందదు.

జీవితం బుద్ధి జనితమైన సూక్ష్మత్వానికి తోడు స్థూలమైన కాయకష్టాన్ని కలిగుంటేనే

కాని సజీవంగా మనలేదు. మానవుడు తన శ్రమ ద్వారానే వ్యక్తమవుతాడు.తనచేయి పని చేయటం మానుకొన్న క్షణాన మానవుడు తన అస్తిత్వాన్నే కోల్పోతాడు.

* * *

మానవుడిలో ఉన్న మానస శక్తుల్లో స్మృతి, విస్మృతి అనేవి చాలా ప్రభావం కలవి. కొందరిలో విస్మృతి కంటే స్మృతి చాలా బలీయంగా వుంటే మరి కొందరిలో ఇందుకు వ్యతిరేకంగా వుంటుంది.

సుఖమైన విషయాలను జ్ఞాపకం చేసుకోటంలో ఆనందం వుంటుంది. సుఖం కాని వాటిని జ్ఞాపకం చేసుకోటంలో బాధ వుంటుంది. అదేవిధంగా సుఖమైన వాటిని మరచిపోవటం బాధ, సుఖంకాని వాటిని జ్ఞాపకం చేసుకోటం బాధ.

ఆప్తుల విపత్తుల సందర్భంలో స్మృతి కంటే విస్మృతే ఎంతో మేలు కలుగజేస్తుంది. మనకు ప్రియమైన స్నేహితులు చనిపోయిన శుభకార్యాల్లో

మన దుఃఖానికి అంతూ పంతూ ఉండదు. కాని రోజులు గడిచినకొద్దీ విస్మృతి తన పనిని సాగించటంతో మన దుఃఖంలోని తీవ్రత పలచబడ ప్రారంభిస్తుంది. కాలానికీ విస్మృతికీ చాలా దగ్గర సంబంధం కనుక మానసికమైన గాయాలకు కాలం అనేది ఒక మహౌషధి. కాలమే మాన్పుతుంది బాధను అంటే, విస్మృతే ఆ పని చేస్తుంది అని అర్థం.

సుఖమైనదాని విస్మృతిని మానవుడు భరించగలడు కాని సుఖంకాని దాని స్మృతిని మాత్రం భరించలేడు. ఈ రెండో దానిలో విస్మృతికి చెందిన ఇంద్రజాలం మాత్రమే మానవుణ్ణి సుఖపెట్టగలదు.

* * *

ఐరోపా, అమెరికా దేశాల్లో ప్రజలు తెల్లగా ఉంటారు. అందుకని ఆ దేశాలను తెల్ల దేశాలంటారు. కాని యీ తెల్ల దేశాల్లోని బొగ్గు నల్లగా ఉంటుంది, కాకి నల్లగా ఉంటుంది. చీకటి నల్లగా ఉంటుంది! ఉష్ణ దేశాల్లోని ప్రజలు నల్లగానూ గోధుమరంగుగానూ ఉంటారు. ఈ దేశా

లను నల్లదేళ్ళాలంటారు. కాని ఈ నల్లదేళ్ళాల్లోని పాలు తెల్లగా ఉంటవి, మంచు తెల్లగా ఉంటుంది. వెలుగు తెల్లగాఉంటుంది!

* * *

మనిషి పూర్తిగా బహిర్ముఖుడుకాదు, పూర్తిగా అంతర్ముఖుడూ కాదు. మరి ఏ ముఖుడూ అంటే ఉభయముఖుడు అనాలి; ఇదీ ఆధునిక మనో వైజ్ఞానిక సిద్ధాంతం. కనుక మనిషి మానవ మనిషి, మహా మానవ మనిషి కూడ. శరీరపు మనిషి, అశరీరపు మనిషి కూడ. పార్థివపు మనిషి, అపార్థివపు మనిషికూడ; ఇంద్రియానుభూతీ, అతీంద్రి యానుభూతీ కూడ కలవాడు. అతని దృష్టిలో జడం అంతా చేతనమే, మానవుడు దేవుడే, భూమి స్వర్గమే, చీకటి అంతా వెలుగే, శూన్యం అంతా పూర్ణమే!

* * *

అసమర్థులు భయపడాలిసిన అవసరం లేని దానికి కూడ భయపడతారు. కాని అందుకు వ్యతి రేకంగా, సమర్థులు భయపడాలిసిన దానికికూడ

భయపడరు. దుర్బలులు కారణం లేనిదానికి కూడ ఆందోళన చెందుతారు. సబలులు ఆందోళన చెందవలసినదానికికూడ ఆందోళన చెందరు.ధీరులు జీవన జ్యోతిని చూచేచోట భీరులు మృత్యుచ్ఛాయలను చూస్తారు. అతి స్వల్పమైన ఆపద కొందరిని వణకింపచేస్తే అతిభీవమైన ఆపదకూడ కొందరిని కదలించలేదు. ధీరులుగా, సబలులుగా, అజేయులుగా ఉండటం, అంటే నిత్యోల్లాసులుగా, నిత్యజాగరూకులుగా, నిత్యోత్సాహులుగా, నిత్యవిముక్తులుగా ఉండడటమే అవుతుంది. స్మరణాతీత కాలంనుంచీ ప్రపంచంలోని మతాలన్నిటికీ చరమ లక్ష్యమైన జీవన్ముక్తి అనేది ఇదే!

*　　*　　*

వృక్షజాతి మానవజాతికి మంచి తోడు. యీ భూమిమీద, ఉభయులూ తాము జీవించటానికి ఒకరిమీద ఒకరు ఆధారపడి వుంటారు. చెట్టు వదలిన ప్రాణవాయువును మానవుడు పీలుస్తాడు, మానవుడు వదలిన బొగ్గు పులుసు గాలిని చెట్టు పీలుస్తుంది.

మండుటెండలు అంతరించి తొలకరి జల్లులు కాలిన నేలను తిడపడపరంతో, ఎండిపోయిన గోధుమ వర్ణపు ప్రాణం గుబ్బలనుండి చీల్చుకొని పైకి వచ్చే పచ్చని మోసులుగుండా ప్రాణం ప్రత్యక్ష మవుతుంది.

జంతువులే అడ్డంగా కాక మానవునిలే నిలువుగా పెరుగుతుంది చెట్టు: అందుకని జంతువుతో కంటే మానవునితో ఎక్కువ సారూప్యాన్ని కలిగి ఉంటుంది చెట్టు.

బోడే కొమ్మా రెమ్మా, ఆకూ మొగ్గా పువ్వా రంగులోనూ, రూపంలోనూ, పరిమళంలోనూ ఎంతో ఎంతో మనోహరంగా వుంటవి, మానవీణనుంచి వెలువడే మధురరాగం వలె!

ఆకులున్న చెట్టుకంటే, ఆకులు రాలిన అస్థిపంజరపు చెట్టు ఇంకా ఎక్కువ మనోహరంగా గోచరిస్తుంది. చచ్చిన చెట్టుకూడ బతికిన చెట్టంత సుందరంగా, ఒకోసారి ఇంకా ఎక్కువ సుందరంగా గోచరిస్తుంది. వృక్షజీవితం ప్రాణమయ కోశానికి చెందింది కనుక వృక్షం అంటే ప్రాణం స్వయంగా మూర్తీ భవించినట్లే!

* * *

ఏకాంతాన్ని కవులూ, చిత్రకారులూ, గాయకులూ, తాత్వికులూ, జ్ఞానులూ, విద్వాంసులూ, ఇంకా జనాంతంతో విసిగిపోయిన ఇతర్లూ ప్రేమిస్తారు. కాని, జనాంతంలోని అల్లకల్లోలాల్నుంచి తప్పించుకునే నిమిత్తం ఏకాంతాన్ని శరణుజొచ్చిన వారికి మాత్రం ఏకాంతం ఎంతో విసుగుగా వుండి వారు తిరిగి త్వరలో జనాంతంలోకి పోవాలని తహతహ లాడతారు. కారణం, ఏకాంతంలోని మౌనమైన మధుర మోహన గానం వారు వినలేరు. వారు ఏకాంతానికి వెళ్ళడం ఏకాంతాన్ని ప్రేమించి కాదు. జనాంతంలోని వివిధ బాధలనుంచి తప్పించుక తిరగాలని మాత్రమే. అందుకని ఏకాంతం అటువంటి వారిని ఆనందపరచ జాలదు. ఒకడొనిమీద ద్వేషం వున్నదంటే రెండోడానిమీద ప్రేమ వున్నదని అర్థంకాదు.

జనాంతానికి ఎవరు భయపడరో, ఎవరి హృదయాలు గంభీరతకూ, ప్రశాంతతకూ, అనంతత్వానికీ, శాశ్వతత్వానికీ సంలగ్నమై వుంటవో, వారు మాత్రమే ఏకాంతంలోని మౌనగానాన్ని వినగలరు. అటువంటి వారికి ఏకాంతం అనేది

శరణాలయంకాదు. సుందరం వైపుకూ గంభీరం వైపుకూ, కరుణామయం వైపుకూ, ఆనందమయం వైపుకూ యాత్రను సాగించడంలో మనకు మహాత్తర ప్రేరణ నిచ్చే నిరంతర సహచరే ఏకాంతం. ఏకాంతంలోని గానం జనాంతాన్నికూడ ప్రతిధ్వనింప చేస్తుంది!

* * *

ఇంద్రియ గ్రాహ్యత తరచుగా, ఎల్లప్పుడు కాకపోయినా, మనను మోసగిస్తూంటుంది. మన బుద్ధి గ్రహించేది ఒక సత్యమైతే మన ఇంద్రియాలు గ్రహించేది మరొక సత్యం. ఈ రెండు సత్యాలూ యథార్థాలుగానే కనిపిస్తవి. కాని, ఇంద్రియాలు గ్రహించే సత్యం దేశంలోని, కాలంలోనీ మార్పులననుసరించిమారుతూంటుంది. అయితే బుద్ధి గ్రహించే సత్యం మాత్రం ఇటువంటి మార్పుల ననుసరించి మారుతూండదు. ఈ రెండవదికూడ శాశ్వతంగా మార్పులకు లొంగదని చెప్పటానికి వీలుండదు.

రైలుబండి వేగంగా పరుగెత్తుతూంటే బయటిచెట్లు వ్యతిరేకదిశలో పరుగెత్తుతూన్నట్లు

రైలులోంచి మన కన్ను చూస్తుంది. కాని పెంటనే మన బుద్ధి గ్రహిస్తుంది. పరిగె త్తేది చెట్లు కావు, రైలుమాత్రమే అని. దగ్గరలో ఉన్న చెట్టుకంటే దూరంలో ఉన్న కొండ చిన్నదిగా కనిపిస్తుంది మన కంటికి. కాని మన బుద్ధికి తెలుసు చెట్టుకంటే కొండ ఎప్పుడూ చిన్నదిగా ఉండదని. ఈ విధంగా మన ఇంద్రియాలు మనను మోసం చేస్తుంటవి ఎక్కువగా !

అయితే, ఎప్పుడైనా బుద్ధికూడా అంత విశ్వాసనీయంగా ఉండకపోవటం జరుగుతూంటుంది. ఈ విధంగా చూస్తే యీ విశ్వసృష్టిలో ఏదీ నిరపేక్షికం (Absolute) కాదేమో, అంతా సాపేక్షిక మేమో (Relative) అనిపిస్తుంది. బుద్ధి అతీంద్రియమైందనీ, అనుభవం ఇంద్రియగ్రాహ్య మైందనీ తలంచబడుతూంది. కాని యథార్థంగా పరిశీలిస్తే ఇంద్రియ గ్రాహ్యత ఎక్కువ మోస కారి, అతీంద్రియత తక్కువ మోసకారి అని మాత్రమే తెలుతుంది. వీటి రెండిటిమధ్య ఉన్న ప్రభేదం అంతమాత్రమే. కారణం, రెండూకూడ సాపేక్షిక వాదానికి లోబడే ఉంటవి. హేతువు బుద్ధికి చెంది ఉంటే, అనుభూతి ఇంద్రియాలకు చెందిఉంటుంది.ఒకోసారి అనుభూతికంటే హేతువే

ఇంకా ఎక్కువ మోసకారిగా ప్రత్యక్షం కావచ్చు కూడ. సత్యాన్ని హేతువాదంతో సమీపించటం మాత్రమే అంతిమ సాధనకాదు. కారణం అసలు సత్యం అనేదే సాపేక్షికం. ఒకవేళ నిరపేక్షిక సత్యం అనేది ఒకటుంటే అది హేతుప్రభా తర్కానికి ఆవలగానే ఉంటుంది. అది హేతుప్రకంటే అనుభూతికే ఎక్కువ సమీపం. అది ఆలోచనా మయం కంటే అనుభూతిమయమే అధికం!

* * *

ఆత్మ ప్రకటనకు మాతృభాష సర్వోత్తమ మాధ్యమం అనటంలో సందేహంలేదు. కాని మాతృభాషలో అభివ్యక్తపరిస్తే కొన్ని అతి సామాన్యమైన అప్రాముఖ్య విషయాలు వీమాత్రం మనోహరంగా కాని, మహత్తరంగా కాని వినిపించవు. కాని వాటినే పరభాషలో అభివ్యక్తపరిస్తే ఏదో ఆకర్షణీయంగా,ఆధిక్యంగా వినిపిస్తవి, ఎంతో విలువగా!

అతి సామాన్య భావావళికూడ పరభాషలోని పదావళిలో రూపం దాల్చినప్పుడు ఎంతో అసామాన్యంగా ప్రత్యక్షమవుతుంది. మన స్వంతం కాని

భాష ఎప్పుడూ ఏదో ఒక రహస్యమయ ఆకర్షణ కలిగివుంటుంది. ఆరహస్యమయితే సామాన్య భావాలనుకూడ అసామాన్యమైన ఇంద్రజాలంతో నింపుతుంది. ఎంత మామూలు విషయమైనా పర భాషలో చదువుతూన్నప్పుడు వింటూన్నప్పుడు ఎంతో అలౌకికంగా తడుతుంది, ఆ భాషలోని కనపడీ కనపడని మేలి ముసుగుగుండా!

* * *

మేఘాలు, తుఫాను, ఉరుములు, వర్షం, ఇంద్రధనువు, మెరుపులు, ఇవన్నీ భయాన్ని ఆనందాన్నికూడ కలిగిస్తయి. మేఘాలు, వర్షం, ఇంద్రధనువు ఆనందాన్నిస్తే తుఫాను, ఉరుములు, మెరుపులు భయాన్ని కలిగిస్తవి. కాని, ప్రకృతిలో యీ రెండు దశలూకూడ సౌందర్యానికి విభిన్న స్వరూపాలే — కమలం, కఠోరం, మధురం, మహత్తరం.

తుఫానుతో నిండిన కారుమేఘాల కరాళ రాత్రిలో ప్రళయాన్ని మరిపించే ఆ మెరుపుల తళ తళలను చూడ్డం ఆ ఉరుముల పెళ పెళలను విసడం, సామాన్యుల హృదయాలలో భీతిని

రేకెత్తిస్తవి. కాని నిమ్నరస చేతననూ, కోమల సౌందర్యపు మామూలుదనాన్ని అతిక్రమించి అసామాన్యమైన దానిలో, గంభీరమైన దానిలో ఆనందం అన్వేషించేవారు ఇటువంటి ప్రళయతాండవాన్ని,విలయ విశేషాన్ని తన్మయహృదయంతో ఆనందించ గలరు. భయాత్మక సంవేదన రసాత్మక ఆనందంలోకి రూపాంతరం చెందుతుంది వారిలో.

ప్రకృతిలోనూ, జీవితంలోనూ వ్యక్తమయే అసాధారణ మైనట్టీ, గంభీరమైనట్టీ, భయానక మైనట్టీ సౌందర్య స్వరూపాలను ఆనందించడం అనేది మానవుణ్ణి భయంనుంచి విముక్త పరుస్తుంది. భయం అనేది మానవుడి బలమైన శత్రు కోటిలో ప్రధానమైనది. ఆనంద శాంతి సౌఖ్యాలను ఆవిరిగా మార్చివేస్తుంది భయం !

* * *

మానసిక భావ తీవ్రత మనిషి ముఖాకృతిని మార్చగలదు అనే నమ్మకం ఒకటి వ్యాప్తిలో ఉన్నది. ముఖం అనేది మనసును ప్రతిబింబించే అద్దం అంటారు. అందుకే ప్రాచీన భారతదేశంలో గొప్ప ఖగోళ శాస్త్రజ్ఞుడుగా ప్రఖ్యాతి చెందిన వరాహ మిహిరుడు అంటాడు:

"ప్రాయోపవికంపాసు భవతి దోషాయత్రా కృతి స్మృత గుణా వసంతి." దోషాలు కురూపుల లోనూ, గుణాలు సురూపులలోనూ ఉంటూంట వట తరచుగా.

వైజ్ఞానికుడు, తాత్వికుడు, కవి, గాయకుడు, నటకుడు, చిత్రకారుడు మొదలైన వారిలో తమ మానసికానస్థను ప్రతిబింబించే లలితమైన ముఖాకృతులు గోచరిస్తుంటవి. వీరిలోని అవ్యక్త మానసిక వ్యాపారాలపు వారి ముఖాకృతులు స్పష్ట చిహ్నలేమో అనిపిస్తుంది. ఈ విధంగా శరీరం అశరీరాన్ని ప్రతిబింబిస్తుంది. మాంసలమైంది మాంసలం కానిదాని ఛాయ.

ప్రతి సిద్ధాంతానికీ అపవాదం అనే హద్దు ఉంటుంది కనుక ఇక్కడకూడ అది సమానంగా వర్తిస్తుంది. అరుపుగా కొందరు వ్యక్తులుంటారు. వారెంతో సృజనాత్మకమైనట్టీ, సమీక్షాత్మకమైనట్టి ప్రతిభలను కలిగి ఉంటారు. ఎంతో ఉజ్వలమైన స్వభావాన్ని కలిగి ఉంటారు. కాని వారి ముఖాకృతులు మాత్రం మామూలుగానూ, ఇంకా కొందరిలో మామూలుకంటే తక్కువగానూ ఉంటవి. వారిని చూడగానే వారు అసాధారణ ప్రజ్ఞగల

వారని, ఉజ్వల జీవితాన్ని గడిపే వారనీ ప్రథమ దృష్టిలో ఎవరూ విశ్వసించలేరు! వారి శారీరక స్వరూపం వారి మనోభావాలకు ప్రతిబింబాలు కావు.

* * *

కొండలు చూడడానికీ, ఎక్కడానికీ, అక్కడ నివసించడానికీ ఎంతో మనోహరంగా ఉంటవి. అవి భూమిమీదనుంచిలేచి ఆకాశంలోకి చొచ్చుకపోయి భూమికీ ఆకాశానికీ మధ్య ఒక నిలువైన వంతెనగా ఉంటవి. బూడిదరంగు కొండలూ, ఆకుపచ్చని కొండలూ, ఊదారంగు కొండలూ, నీలిరంగు కొండలూ, నల్లని కొండలూ, తెల్లని కొండలూ, ఒకో కొండకొకో ప్రత్యేకత కమనీయత, ఒకో విశిష్టమైన మహనీయత.

కొండకంటే లోయలు ఏమాత్రం తక్కువ మనోహరమైనవికావు. వాస్తవానికి కొండల కంటే లోయలే ఎక్కువ మనోహరంగా ఉంటవి. లోయలు లోతుగానూ, రహస్య మయంగానూ ఉంటవి. లోయలోనుంచి కొండవైపుకు పైకి

చూచే దానిక్కంటే కొండబొదనుంచి లోయలోకి క్రిందికి చూడటంలోనే ఎక్కువ ఆనందం తదుతుంది.

కొండలూ, లోయలూ ఒకేచోట సహ జీవనాన్ని గడుపుతవి. కాని మైదానాలు మాత్రం కొండలనుంచీ లోయలనుంచీ వేరై తమ స్వంత అస్తిత్వాన్ని కలిగి ఉంటవి. కొండలు ఎత్తుగా, లోయలు లోతుగా, మైదానాలు సమతలంగా ఉంటవి. లోయలోనుంచి చూస్తే మైదానం మెరకగా గోచరిస్తుంది. కొండమొదినుంచి చూస్తే మైదానం పల్లంగా గోచరిస్తుంది. కనుక కొండకూ లోయకూ మధ్య భాగం మైదానం.

మైదానాల సౌందర్యం సరళంగానూ, విముక్తంగానూ, స్వచ్ఛందంగానూ ఉంటుంది. మైదానాల స్వరూపంలో రహస్య మయత అనేదే గోచరించదు. అవి ఎండాకాలంలో వేడిగానూ, చలికాలంలో చల్లగానూ ఉంటవి. వర్షాకాలంలో తేమగా ఉంటవి. కొండలలోనూ లోయల్లోనూ దూరపు దిగంత రేఖలు కనుపించవు. మైదానాల లోని ప్రత్యేకాకర్షణ ఏమంటే భూమ్యాకాశాలు ఐక్యమయే దూరపు విశాలమైన దిగంతాలు కను

పిస్తవి. ఇటువంటి దిగంతాలు ప్రత్యేకించి ప్రభాత సమయంలోనూ, సాయం సమయంలోను విశేష ఆకర్షణీయంగా ఉంటవి.

నదులు కొండలలో జన్మించి మైదానాలలో ప్రవహిస్తవి. మైదానాలలోని జీవితం వాస్తవవాదం అయితే కొండలలోని జీవితం కల్పనావాదం. కొండలలో నివసించే నిమిత్తం మనిషి మామూలు జీవితంనుంచి పైకి రావలసి ఉంటాడు, కారణం కొండలలోని పొగమంచు మనిషిని ఒకవిధమైన అజ్ఞాత రహస్య మయతలో కప్పివేస్తుంది.

* * *

ఆనందకరమైనదంతా ఎల్లప్పుడూ మేలు చేసేదిగా ఉండకపోవటం, మేలుచేసేదంతా ఆనందకరంగా ఉండకపోవటం జరుగుతుంటుంది. అంటే, ప్రేయం అంతా శ్రేయం కాకపోవచ్చు, శ్రేయం అంతా ప్రేయం కాకపోవచ్చు. పొగ త్రాగటం శ్రేయంగా ఉంటుంది, కాని అది శ్రేయం కాదు. మంచు త్రాగటం శ్రేయమే కాని అది ప్రేయంగా ఉండదు. చదవకుండా ఉండటం

పిల్లలకు ఆసందకరమైన విషయం కాని అది మేలు చేయదు. భోగ జీవితం ప్రేయంగా ఉంటుంది. కానీ శ్రేయంగా ఉండదు. తమ కర్త వ్యాన్ని నెరవేర్చటం శ్రేయంగా ఉంటుంది కాని ప్రేయంగా ఉండదు.

సాధారణంగా చేదుగా ఉండేది తీపి ఫలితాన్నివ్వటం, తీపిగా ఉండేది చేదు ఫలితాన్నివ్వడం జరుగుతూంటుంది. కాని ఈ విధానాన్నంతా తల్లి క్రిందులు చేయాలసిన అవసరం ఎంతైనా ఉంది. ఇప్పుడు నడుస్తూన్న ఈ విధానం పూర్తిగా పరివర్తన చెందాలి.

ఈ నూతన పరివర్తిత విధానంలో మేలు కలిగించేవన్నీ ఆనందకరంగానూ ఉండాలి. ఆనందకరమైనవన్నీ మేలుచేసేవిగానూ ఉండాలి. శ్రేయం అంతా ప్రేయంగా వుండాలి. ప్రేయం అంతా శ్రేయంగా ఉండాలి. ఇటువంటి మహా పరివర్తన ఇదివర కే కొంతవరకు ప్రారంభమై ఉండటం ఎంతో ముదావహం, పొగ త్రాగటం ఇప్పుడు తక్కువ హానికరం చేయబడుతూంది వేరువేరు రసాయనిక ప్రక్రియలద్వారా. త్రాగ టానికి చాలా రుచికంగా మందులు తయారు

చేయబడుతూన్నవి. పిల్లల చదువులు ఆటలవలె ఆనందంతో నింపబడుతూన్నవి. ఇంకా ఇతర కఠిన సమస్యలుకూడా క్రమేణా, క్రొత్తయంగానూ క్రొత్తయంగానూ పరిష్కరించ బడుతూన్నవి.

కనుక ఇక భవిష్యత్తులో క్రొత్తయైనదంతా క్రొత్తయంగానూ, క్రొత్తయైనదంతా క్రొత్తయంగానూ రూపొందుతుంది. నిజంగా అదెంతో అనుకూల సృష్టి కాగలదు!

*　　*　　*

మానవుడు జ్ఞానంతో మాత్రమే జీవించలేడు, జ్ఞానానికి తోడు ఆనందం ఉంటేనేకాని జీవితం సుఖమయంకాదు. జ్ఞానం లేకపోయినా జీవించ వచ్చుకానీ ఆనందంలేంది అసలే జీవించలేడు. ఒక్క మానవుడు మాత్రమే కాదు, ప్రతి జీవికూడ జననం మొదలు మరణంవరకు సాగే తన జీవయాత్రలో ఆనందంకోసం తహతహలాడిపోతుంది.

అయితే, ఆనందం అనేది వ్యక్తిలోని మానసిక రీతుల్ని అనుసరించి భిన్నభిన్నంగా

వుంటుంది. పెద్దల దృష్టిలో ఎంతో అప్రాముఖ్య మైన వస్తువులలో పిల్లలు ఆనందం పొందుతారు. అంతర్ముఖుల ఆనందం బహిర్ముఖులకూ, బహిర్ముఖులది అంతర్ముఖులకూ అప్రధానంగా తడుతుంది. విద్వాంసుని ఆనందం కళాకారుని ఆనందంనుంచి వేరు ఇదేవిధంగా ఎన్నెన్నో.

ఒకే వస్తువు ఒకే వ్యక్తికి అన్ని వేళల లోనూ ఒకే ఆనందాన్నివ్వలేదు. వర్షాలు కరు వైనా వరుపు రోజుల్లో వర్షం మనకు మంచి ఆనందం ఇస్తుంది. కాని అదే వర్షం వరదల రోజుల్లో మనకెంతో భీతిని కలిగిస్తుంది.

దుఃఖం అనేది జీవితంలో అన్నిటిని మించిన గొప్ప బాధ. ప్రతిజీవికీ జీవితం అంటే ఎంతో ప్రీతి. మరణం అంటే ఎంతో భయం. కాని కొన్ని సమయాలలో మరణానికంటేకూడ దుఃఖం చాలా గొప్ప భయంగా మారుతుంది. అటువంటప్పుడు దుఃఖమయ జీవితానికంటే మర ణమే ఎక్కువ మధురంగా తడుతుంది. దాని ఫలితమే ప్రపంచంలో ప్రతి సంవత్సరం ఎన్నో ఆత్మహత్యలు!

దుఃఖం లేకపోవటం మాత్రమే ఆనందం కాదు. దుఃఖంతో బాధపడని వాళ్ళంతా ఆనందంలో విహరిస్తున్నారనటానికి వీలులేదు. ఆనందం అనేది ఒక నిండుదనమైన స్థితి. దీన్ని మనిషి తన నిరంతర సాధన ద్వారా, చిరంతన జీవనాను భవంద్వారా సృష్టించుకోవాలి. బాధ లేనంత మాత్రాన సుఖం వున్నట్లు కాదు.

మానవుడు జీవితంలోని వివిధ రంగాలకు-రాజకీయ ఆర్థిక, సాంఘిక, పారివారిక, సాంస్కృతిక, శారీరక, మానసిక వగైరా—చెందిన అనేక బాధలను పూర్ణంగా నశింప జేయలేడు. అయినప్పటికీ, బాధల నీడలు తాకలేని ఒక విధమైన ఆనంద మయమైన మానసికా వస్థను సృష్టించుకోగలడు.

ఆస్ట్రియా దేశపు సన్యాసి స్వామీ అగేహానంద చాలా సుందరంగా అన్నాడు. "నేను సన్యాసి అయినది శోకంనుంచీ బాధనుంచీ తప్పించుకోవాలని కాదు, ఈ ఇంద్రియాలు ఇవ్వలేనట్టి మహత్తర ఆనందాన్ని అనుభవించాలని మాత్రమే.

నే నొకసారి వ్రాశాను:

Devoid of daylight earth is a dark sheath
Devoid of dalight life is a melancholy death.

దివాకాంతి లేనిది ఈ భూమంతా ఒక చీకటి పేటిక
ఆనందంలేనిది ఈ జీవితమంతా ఒక విషాదపు మృత్యు వాటిక.

పూవులు రంగుకూ రూపానికీ తావికీ సజీవ మూర్తులు. దళాలతో రచించిన మూగ కవితలు పూవులు. తావినే ప్రధానంగా కలిగివున్న పూవులు కొన్ని అయితే రంగునే ప్రధానంగా కలిగున్న పూవులు మరికొన్ని. ఇక కొద్ది పూవులుంటవి తావిలోనూ రంగులోనూకూడా ప్రాధాన్యం కలవి.

ఆకుపచ్చలో తప్ప పూవులు అన్ని రంగుల్లోనూ వుంటవి. ఆకుపచ్చ అనేది ప్రత్యేకించి ఆకుల రంగు కావటంతో పూవులలో ఆ రంగు అరుదు. ఆకులు సూర్యరస్మిని గ్రహించటానికి వుపయోగించే క్లోరో ఫిల్ రసాయనం ఆకుపచ్చలో వుండటం వల్ల ఆ రంగు ప్రత్యేకం ఆకుల వరకే పరిమితం అయివుంది. సాధారణంగా

సంపెంగపూలు ఆకుపచ్చగా వుంటవి కాని అవి బాగా వికసించేప్పటికి ఆ ఆకుపచ్చ ఆకుపచ్చ రంగు కంటే పసుపు రంగుకే దాపులో వుంటుంది.

మందారం ఎరుపు, చేమంతి పసుపు, ప్రభాత శోభలు నీలం, మల్లెలు తెలుపు; తామరలు చాలా రంగులలో వుంటవి; తెల్ల తామర, నీలి తామర, ఎర్రతామర, పసుపు తామర మొదలైనవి. సంపెంగలూ, మల్లెలు, మృదువైన రంగూ, ఘాటైన తావీ కలిగుంటవి; మందారానికి ఘాటైనరంగు వుంటుంది. కాని తావి వుండదు.

పూవులను చూడటం అంటే మేఘాల లోకాలనుంచి భూమి మీదకు తెచ్చి నాటిన ఇంద్ర ధనస్సును చూడటమే!

* * *

ప్రేమకూ కామానికీ మధ్య సరిహద్దు గీత గీయటం అంత సులభం కాదు. ప్రేమ మానసిక మనీ, కామం మాంసలమనీ, ప్రేమ మనో శాంతినిస్తే కామం అశాంతిని కేకెత్తిస్తుందనీ

మాటల్లో నిర్వచించటం సులభమే కాని వాస్తవ జీవితంలో మాత్రం ఈ నిర్వచనాలు తమ నిర్ణయాన్ని గోల్పోతవి. ప్రేమా కామం రెండూ తమ అంచులను ఒక దానితో మరొకటి కలిపే ఉంటవి. విశ్వ విఖ్యాత మనస్తాత్వికుడైన సిగ్మండ్ ఫ్రాయిడ్ సిద్ధాంతం ప్రకారం మాతృప్రేమ మీదకూడా అధోచేతనలో దాగివున్న కామ వాంఛ తన ఛాయలను వేస్తుందని. కాని మరో విఖ్యాత మనస్తాత్వికుడైన డాక్టర్ సి. జి. యుంగ్ (jung) ఫ్రాయిడ్ కనుగొన్న ఈ గుప్త కామ వాంఛా సిద్ధాంతం నిజమైంది కాదని సిద్ధాంతీకరించాడు.

ప్లేటోనిక్ ప్రేమ అనేది ప్రియతమ యొక్క శరీర స్పర్శతో అవసరంలేని ఒక విశుద్ధ ప్రేమగా పరిగణించ బడుతూ వచ్చింది. కాని పరిశీలించి చూస్తే ప్లేటోనిక్ ప్రేమ అనేది తన మృదు త్వాన్ని అతిక్రమిస్తే ఆలింగన చుంబనాదులు మొదలైన కోమల శృంగార చేష్టలలోకి దారి తీస్తుంది. తరువాత అదే లైంగిక సమ్మేలనంలోకి కూడా పరిణమించవచ్చు. అప్పుడప్పుడు వరసా వావీ లేని వారితో కూడా గాఢ ప్రేమ వీర్పడి ప్రణయంలోకి మారటం కూడాకద్దు. దీన్నే విజ్ఞా

సంలో incestuous love (వరసలేని ప్రేమ అంటారు.

ప్రేమ అనేది ఒకటే, అది ప్రవహించే కాలవల ఆకారాల బట్టి దాని రూపు మారుతూంటుంది. ఇంద్రియానుభూతి వైపుకు ప్రవహించినప్పుడు కామం అవుతుంది. అతీంద్రియ సత్తా వైపుకు ప్రవహించినప్పుడు భక్తి అవుతుంది.

* * *

"విషయ వస్తువుకు సంబంధించి నంత వరకు శిల్పకళ కంటే చిత్రకళ చాలా వైశాల్యాన్ని కలిగి ఉంటుంది. కాని కవిత్వంతో పోలిస్తే మాత్రం చిత్రకళా పరిధి చాలా పరిమితం" అంటాడు జపాను కళావేత్త సీ—ఇచీ—టాకీ. అవును శిల్పకళ రూపొందించే విషయ వస్తువు చిత్రకళ చిత్రించే దాని కంటే చాలా పరిమితం. ప్రకృతిలోని అతి సున్నితమైన వాతావరణపు స్థాయిలను చిత్రించ గలదు చిత్రకళ. కాని శిల్పకళ వాటిని సృష్టించ జాలదు. రంగుకు సంబంధించిన సూక్ష్మమైన ఛాయలు కూడా

చిత్రకళకు అంతు బాటులో ఉంటవి కాని శిల్ప కళకు అవి అందవు.

శిల్ప కళ విఫలం అయిన చోట చిత్ర కళ సఫలం అవుతుంది. చిత్రకళ విఫలత చెందిన చోట కవిత్వం సఫలత చెందుతుంది. చిత్రకళ ప్రధానంగా బాహ్య జగత్తులోని దృశ్య రూపా లను చిత్రించే కళ. నేడు ఎంతో నైరూప్య చిత్రణ అనబడేది కూడా కవిత్వం అభివ్యక్త పరచే నైరూప్య భావాలనూ, అతి సూక్ష్మమైన అను భూతులనూ అభివ్యక్తపరచ జాలదు. కారణం, భావనా, అనుభూతీకూడా రూపంతో కంటే పదంతోనే ఎక్కువ సామీప్యాన్ని కలిగి ఉంటవి. పదాన్ని బయటి సహాయం ఏమీ లేకుండా, లోపలి నుంచే ఉత్పత్తి చేయొచ్చు. కాని రూపాన్ని ఉత్పత్తి చేయటానికి బయటిదైనా ఒక భౌతిక మాధ్యమం అవసరం. కనుక పదం అనేది రూపాని కంటే ఎక్కువ సూక్ష్మమైన మాధ్యమం. అందుకనే ఆలోచనకూ అనుభూతికీ చెందిన అదృశ్య జగత్తును అభివ్యక్త పరచటానికి చిత్ర కళ కంటే కవిత్వం అధిక శక్తివంతమైంది. కవిత్వం చిత్రకళవలె దృశ్య కళా కాదు. సంగీతం వలె శ్రవ్యకళాకాదు. అవో ప్రత్యేక ఇంద్రియానికి

చెందిన కళ. ఏశబ్దమూ చేయకుండా కవిత్వాన్ని మౌనంగా చదువుకోవచ్చు.

కవిత్వం అనేది నాదంలేని సంగీతం, రంగు లేని చిత్రం, రూపంలేని శిల్పం. శిల్పాన్ని చేతితో స్పర్శించవచ్చు, కంటితో చూడవచ్చు; చిత్రాన్ని కంటితో చూడవచ్చు మాత్రమే, ఇక కవిత్వాన్ని చేతితో తాకనూలేం, కంటితో చూడనూలేం. వినకుండా సంగీతాన్ని ఆనందించలేం. కాని కవిత్వాన్ని వినకుండా కూడ ఆనందించగలం. కవిత్వాన్ని ముక్కుతో ఆఘ్రాణించలేం, నాలుకతో రుచి చూడలేం. అందుకే కవిత్వం అనేది శబ్ద, స్పర్శ, రూప, రస, గంధాది ఇంద్రియాను భూతు లన్నిటికి అతీతమైంది! కవిత్వం అతీం ద్రియం. అయితే ప్రతి కళాకూడ — శిల్పం, చిత్రం, సంగీతం, నాట్యం, సాహిత్యం — దేని ప్రత్యేక స్థానంలో అదే గొప్పది.

*　　*　　*

ఆత్మ విశ్లేషణ (self-analysis) అనేది మన జీవన లక్ష్యాన్ని అందుకోవటంలో ఉప కరించే ఉత్తమ సాధనాలలో ఒకటి. మన బాహ్య

జీవితంలోని అనంతమూ రాలను తిలకించే దూరదర్శిని ఆత్మవిశ్లేషణ. మన అంతర్జీవితంలోని అతి సూక్ష్మ విశేషాలను పరిశీలించే సూక్ష్మదర్శిని ఆత్మవిశ్లేషణ. మనను మనం ఎప్పుడైతే స్వాయంగా విశ్లేషించి చూచుకొంటామో అప్పుడు మన జీవితం స్ఫటికంవలె పారదర్శకమై అందులో ఉండే సూక్ష్మాతి సూక్ష్మలోపం కూడ మనకు గోచరిస్తుంది.

ఆత్మ విశ్లేషణ లేనప్పుడు అంతర్దృష్టి నశిస్తుంది. అంతర్దృష్టి నశించినపుడు మన స్వీయ జీవితాల్లోని చీకటి గుణాలను మనం కనిపెట్ట జాలం. ఆత్మ విశ్లేషణ లోపించి నపుడు మన స్వీయ జీవితాల్లోని మంచిని మాత్రమే మనం చూడగలం కాని చెడును చూడజాలం. అటు వంటి స్థితిలో మంచిని మనలో చూస్తాం, చెడును ఇతర్లలో చూస్తాం.

అన్నమయ, ప్రాణమయ, మనోమయ, విజ్ఞానమయ, ఆనందమయ మొదలైన అన్ని కోశాలకూ సంబంధించిన జీవితాన్నంతా విశుద్ధ పరచే అగ్నిపరీక్ష ఆత్మవిశ్లేషణ. ఆత్మవిశ్లేషణ పుంజే వ్యక్తి జీవితంలో ఆపదే పుండదు, వ్యక్తి

జీవితంలో ఆపద లేనప్పుడు జాతిజీవితంలో కూడ అంతే.

* * *

వినిపించే రాగాలకంటే వినిపించని రాగాలు అధిక మధురతరం అని గానం చేశాడు కీట్సుకవి. అదేవిధంగా చిత్రించిన చిత్రాలకంటే చిత్రించని చిత్రాలు అధిక రమ్యతరం. అందుకే స్వర్గీయ నికొలస్ రోరిక్ అంటూండేవారు, "The best painting is that which has not yet been painted- ఇంత వరకూ చిత్రించబడని చిత్రం ఏదైతే వున్నదో అదే వుత్తమ చిత్రమట!

ఇదే సత్యం జీవితంలో కూడ సమానంగా వర్తిస్తుంది. అభివ్యక్తమైన జీవితానికంటే అవ్యక్తమైన జీవితం ఎంతో అధిక మనోహరంగా ఉంటుంది. మరణానికీ జననానికీమధ్య అవ్యక్తంగా ఉన్న జీవితం జననానికీ మరణానికీ మధ్య జీవిస్తూన్న జీవితానికంటే ఎంతో ఎక్కువ జీవవంతమైనది. జననానికీ మరణానికీ మధ్యఉన్న జీవితానికీ, మరణానికీ జననానికీ మధ్య ఉన్న జీవితానికీ ఎంతో తారతమ్యం ఉన్నది. ఒకటి జసనాంతర

మరణ పూర్వపుది అయితే రెండోది మరణానంతర జనన పూర్వపుది. ఒకటి అభివ్యక్తం, రెండవది అవ్యక్తం.

అభివ్యక్త జీవితం వినిపించే రాగంలాంటిదీ, కనుపించే చిత్రం లాంటిదీ! అవ్యక్తజీవితం విని పించని రాగం లాంటిది కనుపించని చిత్రంలాంటిది.

* * *

సుఖ శాంతుల్లో ఉండే ధనహీనులనూ, విద్యాహీనులనూ చూచి ఆపదల్లోనూ, బాధ ల్లోనూఉన్న ధనికులూ, విద్యావంతులూ అసూయ చెందుతారు. కాని ధనహీనులూ, విద్యాహీనులూ మాత్రం ధనవంతుల పట్లా, విద్యావంతుల పట్లా ఎల్లప్పుడూ అసూయ చెందుతారు. ఒకరికి మరి యొకరి యందుండే ఉభయ వైఖరులూ ఉభయుల జీవితాలకూ అంతగా ఆరోగ్య ప్రదమైనవి కావు. జీవితంలో ధనమూ విద్యా మాత్రమే సర్వస్వం కావు. అంతకు మించిన సున్నిత విషయాలు, అంతకు మించిన ఆనందకర విషయాలు, అంతకు మించిన కాంతిమయ విషయాలు ఇంకా కొన్ని ఉన్నవి.

* * *

వర్షం, ఎండా, ధూళీ, మంచూ, చంద్రుడూ, చెట్లూ మొదలైనవి సుకుమార హృదయాల్లో రసానందపు ప్రకంపనలను సృష్టించే కొన్ని విశేష దృశ్యాలు.

వేసవిలో వర్షం, చలికాలంలో ఎండా, ఉదయాన మంచూ, సాయంత్రం ధూళీ, శరత్‌లో చంద్రుడూ, వసంతంలో చెట్లూ, చూడటానికి ఆనందమయంగా ఉంటవి. ఎండలో వర్షం మనోహరంగా కనిపిస్తుంది. దగ్గరలోని ధూళిగుండా దూరపు మంచు రమ్యంగా గోచరిస్తుంది. చెట్ల ఆకు రాలిన కొమ్మలగుండా చంద్రుడు లావణ్యంగా కనుపిస్తాడు. అందుకే ఒక కవి గానం చేశాడు.

"Now I hung the moon
On the pine
Now I took it off the tree."

ఓ
చంద్రుని ఇప్పుడే
చెట్టున వేశా
మళ్ళీ ఇపుడే తీసివేశా.

ప్రకృతి శోభను ఆనందించటం అనేది ఒక పవిత్రమైన సౌందర్యతత్వం. వర్షం, ఎండా,

ధూళీ, మంచూ, చంద్రుడూ, చెట్లూ వీటి వెలుగు వెలిగిస్తుంది ద్రష్ట హృదయంలోని దీపాన్ని.

* * *

కొందరి కోరికలు ఎక్కువ ప్రయత్నం లేకుండానే నెరవేరుతని. ఎంతో ప్రయత్నం ఉన్నా కూడా కొందరివి నెరవేరవు. ఎక్కువ తెలివిగల వాళ్ళు శ్రమపడికూడ పరీక్షల్లో తప్పటం, తక్కువ తెలివికలవాళ్లు తక్కువ శ్రమపడి ఉత్తీర్ణులు కావటం కనుపిస్తూంటుంది. ఇటువంటి ఘటనలు ఒకోసారి హేతువాదానికి అందనట్లు కనుపిస్తవి. కాని హేతువాదానికి అతీతం అనుకునే వాటికెన్నిటి మూలంలోనో హేతువాదమే వుంటుంది. మన కార్యసిద్ధికి మన ప్రయత్నాలు మాత్రమే చాలవు. కార్యసిద్ధికి తోడ్పడటానికి ఇంకెన్నో ప్రాముఖ్యమైన విషయాలున్నవి. పరిసరాలు, ముఖ్య స్థానాలలో ఉండవలసిన ప్రత్యేక వ్యక్తులు, కార్యాన్ని సాగించతగిన తరుణం మొదలైనవాటన్నిటిమీదా కార్యసిద్ధి ఆధారపడి వుంటుంది. ఇవన్నీ కలసి వచ్చినప్పుడు మామూలుకంటే తక్కువైన మనిషి కూడ కొద్ది ప్రయత్నంతోనే సఫలత చెందగలడు.

ఇవన్నీ సమకూడనప్పుడు మామూలు కంటే మించిన మనిషికూడా ఎంత ప్రయత్నించినప్పటికీ విఫలత చెందుతాడు!

కాని ఈ అనుకూలతల ప్రతికూలతల విషయం వేమిటి? ఒకళ్ళయెడల అనుకూలత ఎందుకని, మరొకళ్ళ యెడల ప్రతికూలత ఎందుకని? అది కాకతాళీయమా? దీన్ని విశదీకరించటంలో 'అదృష్టం'అనేపదాన్ని సహాయంగా తీసుకుంటారు తరచుగా. అదృష్ట వాదం అనేది పునర్జన్మ సిద్ధాంతంతో ముడిపడి వుంటుంది. పునర్జన్మ సిద్ధాంతం ఆత్మయొక్క అమరత్వంతో అతికి వుంటుంది.

ఏమైనప్పటికీ, అదృష్ట సిద్ధాంతంలోని కొంత భాగం సహేతుకమేమో అనిపిస్తుంది. అదృష్టం అనేది కార్య కారణ సంబంధంతో సంబద్ధమై ఉంటుంది. కారణం లేంది కార్యమే లేదు. క్రియలన్నీ ప్రతిక్రియలుగా రూపొందుతవి. ఈ అనంత బ్రహ్మాండ గోళమంతాకూడ కార్య కారణాల అనంత చక్రం. మానవుడు తానుచేసిన కార్యానికి ఫలితమే తాను. కనుక తన భాగ్యానికి తానే కర్త. వేదికూడా ముందుగా నిర్ణీతమై

వుండదు. అంతా స్వేచ్ఛాపూరిత నిర్ణీతమే. ఈ అర్థంలో అదృష్టవాదం అనేది మానవుణ్ణి స్వేచ్ఛా మానవుణ్ణిగా స్వేచ్ఛాపూర్ణ ఆలోచకునిగా తయారు చేస్తుంది, తన స్వేచ్ఛా జీవనపు స్వేచ్ఛా సౌధాన్ని నిర్మించుకోటానికి!

* * *

కాబోయే పౌరునకు శారీరక మానసిక వికాసాలు కలిగించటంలో విద్యయొక్క లక్ష్యం కేవలం ప్రజ్ఞానాన్నివ్వటమేకాదు. లాలిత్యాన్ని వ్వటంకూడ.

కాని ఎక్కువమంది విద్యావంతులలో భోగట్టా మాత్రమే ఎక్కువ కనిపించి ప్రజ్ఞా నమూ లాలిత్యమూ లోపించి ఉంటూన్నవి. వారిలో మేధకు సంబంధించిన జాగృతికాని హృదయానికి సంబంధించిన మాధుర్యంకాని, సమిష్టాత్మక హేతువుకాని, సృజనాత్మక చేతన కాని అంతగా వికసించినట్లు కనుపించవు. మాన వునికి సంస్కృతి ప్రసాదించటం విద్యయొక్క ఒక ముఖ్య లక్ష్యమైనప్పటికీ విశ్వవిద్యాలయాలనుంచి

వారు తగినంతగా సంస్కృతి లేకుండానే బళ్ళు టికి వస్తున్నారు.

ఇందుకు వ్యతిరేకంగా, సగం చదివినవారి లోనూ, అసలు చదవనివారిలోనూ కొందరిలో, చదివినవారిలోలేని సంస్కృతి కనుపిస్తుంటుంది. ఈ సగం చదివినట్టి అసలు చదవనట్టి వారిలో పదునైన మేధా, రసమయ అభిరుచీ, మధురమైన వర్తనా, లలితమైన జీవనం గోచరిస్తవి. విద్యకూ సంస్కృతికీ మధ్య దూరం ఏర్పడుతుంది.

*　　*　　*

భయం అనేది మానవుడు జయించాల్సిన అన్నిటికంటె గొప్ప శత్రువు. స్మరణాతీత కాలం లోని ఆదిమ మానవుల్లో ఉండిఉన్న భయతత్వం ఆధునిక మానవునిలోకూడ నశించక అదేవిధంగా ఉండిఉంది.

రాజనైతిక భయం, ఆర్థిక భయం, సాంఘిక భయం, కౌటుంబిక భయం, వ్యక్తిగత భయం ఇవన్నీ ఆధునిక మానవుణ్ణి నిరంతరం బాధిస్తూ మానసికంగా అశాంతి కలిగిస్తూ ఒకవిధమైన

మానసిక రోగిగా తయారుచేస్తూన్నవి. పగలూ రాత్రీకూడా ఆర్థిక విషయాల గురించీ, వ్యాధులూ వ్యధలూ గురించీ, జీవన మరణాల గురించీ మానవుడు భయభీతుడై పోతున్నాడు.

లోకంలోని దుఃఖాలూ బాధలూ అన్నిటికీ భయం అనేదే మూలం ప్రధానంగా. మానవుణ్ణి చుట్టివున్న చీకటికంతా భయం అనేదే జన్మస్థానం. భయాన్ని జయించటమే శాంతికీ, సౌఖ్యానికీ, ఆనందానికీ రాచబాట.

పరిశీలన, వివేకం, అంతర్దృష్టి ఉంటే మానవజీవితంలోని ఈ మిథ్యాభయం సమూలంగా రూపుమాసి పోతుంది. భయం అంతరించటమే ఆనందం ఆవిర్భవించటం.

* * *

ఈ సూర్యుని క్రింద ఏదీ క్రొత్తదికాదు. అయినా ప్రతిదీ క్రొత్తదే. సూర్యుడు క్రొత్తవాడేమీకాదు. సృష్టి ప్రారంభంనుంచీ సూర్యుడు నిత్యం ఉదయిస్తూనే ఉన్నాడు. అస్తమిస్తూనే ఉన్నాడు.అయినా, నిత్యం క్రొత్తవాడే సూర్యుడు.

నిన్నటి సూర్యుడు నేటి సూర్యుడుకాదు. ఆకారం పాతదే అయినా ఆంతర్యం మాత్రం క్రొత్తదే. నిత్యం సూర్యుని బరువులోనూ, తాపమానం లోనూ మార్పు వుంటూనే వుంటుంది. అందుకే సూర్యుడు క్రొత్తవాడు కానప్పటికీ క్రొత్తవాడే.

నది ఎప్పటి పాతదే, అయినా అది ప్రతి క్షణమూ[నిరంతర]నూతనమే. ప్రతి క్షణమూ సరికొత్త నీరే అందులో ప్రవహిస్తూంటుంది కనుక నిత్య నూతనమే. అయినా అది పాతదిగానే కనుపిస్తుంది.

మనం క్రొత్తదిగా తలచి అభివ్యక్తపరచే భావం ఏదీకూడా క్రొత్తదికాదట. ఎప్పుడో, ఎక్కడో, ఎవరిచేతనో అది ఇదివరకే అభివ్యక్త పరచబడి ఉంటుందట. అందుకే డాక్టర్ సి. జి. యూంగ్ అంటాడు. "మనం భావాలను సృష్టించం, భావాలే మనను సృష్టిస్తవి." అని.

అయినా, మనం అభివ్యక్తపరిచే భావం అభివ్యక్తపరచే రీతినిబట్టీ, తాడిన శబ్దాలనుబట్టీ నూతనంగానే గోచరిస్తుంది. అందుకే నిజంగా ఈ

సూర్యుని క్రింద వీదీ క్రొత్తదికాదు. అయినా అంతా క్రొత్తదే!

* * *

కొందరు తమలోఉన్న సృజనాత్మక ప్రతిభనో, లేక సమీక్షాత్మక ప్రతిభనో, లేక ఉభయ ప్రతిభనో చూచుకు గర్విస్తే మరికొందరు తమలో అటువంటివి లేనందుకు అదేవిధంగా గర్విస్తారు! మొదటివారు తాము కవులమనో, గాయకులమనో, చిత్రకారులమనో, భౌతిక శాస్త్రజ్ఞులమనో, రసాయన శాస్త్రజ్ఞులమనో గర్విస్తూంటే, ఇక రెండవ వారు తాము అటువంటి వారమేనీ కామనీ, అటువంటి విషయాలు తమకేమీ తెలియవనీ, అటువంటి వాటన్నిటికీ తాము దూరంగా ఉంటామనీ ఇంకా ఎక్కువగా గర్విస్తారు.

కొందరు తమలో జ్ఞానమున్నదని గర్విస్తే, మరికొందరు తమలో అజ్ఞానమున్నదని గర్విస్తారు. బహుశా రెండవవారిలో వున్న అల్పత్వానుభూతి (Inferiority complex)కి తల్లిక్రిందుల ప్రతిబింబమై వుంటుంది. వారిది అభావ విరక్తి యేమో?

* * *

కొందరి ప్రతిభలు బహుముఖంగా వుంటవి. సాహిత్యంలో, సంగీతంలో, చిత్ర రచనలో అన్ని టిలో అభిరుచిని మాత్రమే కాక ప్రగాఢ పరిజ్ఞానాన్నే కలిగివుంటారు. ఇటువంటివారు తమ ప్రత్యేకతను నిలుపుకోటానికి చేసేపనులు ప్రత్యేకంగానే వుంటవి. కవుల సమ్మేళనంలో వీరు చిత్రకళను గురించీ, చిత్రకారుల సమావేశాలలో కవిత్వాన్ని గురించీ ప్రసంగిస్తారు. ఇంగ్లీషు రచయితలతో వీరు తెలుగు సాహిత్యాన్ని గురించీ, తెలుగు రచయితలతో ఇంగ్లీషు సాహిత్యాన్ని గురించీ ముచ్చటిస్తారు. అనుమతి కనక లభిస్తే వీరు మహిళాసభల్లో పురుషుల గొప్పదనాన్ని గురించి ప్రసంగిస్తారు !

*　　*　　*

సాదాగా జీవిస్తూ ఉన్నతంగా ఆలోచించటం ఒక ఉత్తమ జీవన విధానంగా ఎంచబడుతూంది మామూలుగా. సాదాగా జీవిస్తూ సాదాగా ఆలోచించటం ఒకవిధమైన తిక్కవరకం జీవితంగా తీసుకోబడుతూంది. అయితే ఉన్నతంగా జీవిస్తూ సాదాగా ఆలోచించటం ఎందులోకొస్తుంది? ఇది సాదాగా జీవిస్తూ ఉన్నతంగా ఆలోచించటానికి వ్యతిరేక విధానం. ఇక నాలుగోది పురి,

ఉన్నతంగా జీవిస్తూ ఉన్నతంగా ఆలోచించటం; ఇది సాదాగా జీవిస్తూ సాదాగా ఆలోచించటానికి వ్యతిరేక విధానం.

ఉన్నతంగా జీవిస్తూ ఉన్నతంగా ఆలోచించటం నిజమైన ప్రభుస్వామికం (aristocratic.) ఉన్నతంగా జీవిస్తూ సాదాగా ఆలోచించటం మిథ్యా ప్రభుస్వామికం (Psendo-aristocratic.) సాదాగా జీవిస్తూ ఉన్నతంగా ఆలోచించటం నిజమైన ప్రజాస్వామికం (democratic.) ఇక సాధాగా జీవిస్తూ సాదాగా ఆలోచించటం మిథ్యా ప్రభుస్వామికం (Pseudo-democratic.) ఈ నాలుగింటిలో రెండు ఉత్తమమైనవి. అవి ఉన్నతంగా జీవిస్తూ ఉన్నతంగా ఆలోచించటం; సాదాగా జీవిస్తూ ఉన్నతంగా ఆలోచించటం. తిరిగి ఈ రెంటి లోకీ రెండోది ఎక్కువ విలువకలది. కారణం, ఉన్నతంగా ఆలోచించటం అనేది దానికి వ్యతిరేక మైన సాధాగా జీవించటం అనేదాని సమక్షంలో ఇంకా ఎక్కువగా ప్రకాశిస్తుంది. రెండు విషయా లలో ఒకటి అధికంగా ప్రకాశించాలంటే ఆ రెంటిలో ఒకటి అణగి వుండాలి!

* * *

నీడలు రసాత్మకమైన ప్రాకే వస్తువులు. కదులుతున్నా, కదులుతూండనీ రూపాలకు కదిలే ముద్రలు నీడలు. చెట్టు ఎక్కడున్నదో అక్కడే వుంటుంది, కాని దాని నీడమాత్రం అదృశ్య గంతవ్యాల వైపుకు పయనిస్తుంది.

ప్రకృతిలో సహజంగా కవిత్వమయం కాని వస్తువు రసాత్మకంగా గోచరించదు; కాని అదే వస్తువును దాని నీడతో కలిపి చూస్తే అది ఎంతో కవిత్వమయంగా గోచరిస్తుంది.

నీడల నిజమైన సౌందర్యం చలికాలంలో కాని వ్యక్తంకాదు. చలికాలంలో మధ్యాహ్న సమయంలో కూడ నీడలు ఉత్తర దిశగా పొడవుగా ప్రాకివుంటవి; ఇక సాయంత్రానికి అవి ప్రాకి ప్రాకి సుదూర దిగంతాల అస్పష్టమైన అంచులతో మేళవిస్తవి. గడ్డిపోచ నీడ కొబ్బరిచెట్టు ఆకారాన్ని తాలుస్తుంది, కొబ్బరిచెట్టు నీడ కుతుబ్‌మినార్ అవుతుంది చలికాలపు సాయంత్రాలలో!

ప్రకృతి విషయం సరే, ఇక చిత్రికళలో నీడ విలువ అంతాఇంతా కాదు; అది రసానందపు శిఖరాలనందుకొంటుంది. చిత్రంలో కాని, ఫోటో గ్రాఫ్‌లో కాని ఒక్కో వస్తువు నీడనైనా మూలగా

గనుక ప్రదర్శిస్తే ఆ కళాకృతిని అది కళాఖండంగా మారుస్తుంది.

నీడ అనేది కేవలం ఒక మిథ్యాభాసగానూ దాని అసలు వస్తువు ఒక నిజమైన పదార్థంగానూ భావించబడుతూన్నవి. కారణం, అసలు వస్తువును వదలితే నీడకు స్వతంత్రమైన స్వీయ అస్తిత్వం లేదు కనుక. నీడ లేకుండా వస్తువు వుండగలదు కాని వస్తువులేండి నీడ వుండజాలదు.

కాని పైవాదం పైకి సత్యంగా కనిపిస్తున్నా కూడ అది ఎంతవరకు సత్యం? మన కంటి దృష్టి అందినంతవరకు మాత్రమే సత్యం.

వస్తువు లేంది నీడ వుండనన్నట్లే నీడలేంది వస్తువుకూడ వుండలేదు. వస్తువు ఎల్లప్పుడూ దాని నీడతోో కూడే వుంటుంది! నీడలేని వస్తువనేదే వుండదు. కాంతిలోని దీప్తి ననుసరించి నీడలోని స్పష్టత మారుతూంటుంది. ఎక్కువ ఉజ్వలమైన కాంతిలో నీడ ఎక్కువ స్పష్టంగానూ, తక్కువ ఉజ్వలమైన కాంతిలో తక్కువ స్పష్టంగానూ గోచరిస్తుంది. మసక కాంతిలో నీడ చాలా అస్పష్టంగా గోచరిస్తుంది. ఇక చీకటిలో లయితే నీడ అదృశ్య రూపంలో వుండి నగ్న నేత్రానికి

కనుపించదు. అదృశ్య వస్తువులన్నీ, లేనివాటిలో లెక్కకాదు. కనుక వస్తువు ఎంత వాస్తవమైందో నీడ అంతకంటే తక్కువ వాస్తవమైంది కాదు. నీడ అనేది మాయకాదు, భ్రమకాదు; అది కేవలం కాంతికి వ్యతిరేక స్వరూపమే.

* * *

ధ్యానం అంటే తెలియనిదాన్ని తెలుసుకొనే కళ, చూడనిదాన్ని చూచే కళ, వినని దాన్ని వినే కళ, జీవించనిదాన్ని జీవించేకళ. క్లుప్తంలో చెప్పాలంటే, ధ్యానం అనేది అశరీరానందాన్ని అందుకొనే సాధనా, సిద్ధికూడ. ఇంద్రియాల బాహ్య జగత్తునుంచి అది తప్పించుకొనే పలాయనమార్గం కాకపోగా, ఇంద్రియాల అసమగ్ర జగత్తును సమగ్రపరిచే ఒక విలక్షణవిధానం అది-మామూలు జీవితానికంటే ఎంతో ఎక్కువ పూర్ణజీవితం అది.

నిత్యజీవితాన్నుంచి వేరుపడి ఏ కొద్ది క్షణాలో అనుభవించేదిగా వుండకూడదు ధ్యానం అనేది. ఒకమూల కళ్ళూ చెవులూ మూసుకొని కూర్చొనేదిగా వుంటే ధ్యానం అది కేవలం పని ధ్యానం మాత్రమే అవుతుంది. నిత్యజీవితపు కార్య కలాపాలతో అంతర్లీనమై వుండాలి ధ్యానం. ఈ

విధానం ప్రహ్లాదుని జీవితంలో సుందరంగా చిత్రించబడింది. తింటూన్నపుడు, స్నానం చేస్తూన్నపుడు, ఇతర్లతో మాట్లాడుతూన్నపుడు, నిద్రిస్తూన్నపుడు, ఇంకా ఏమేమి చేస్తున్నాసరే, ప్రహ్లాదుడు అశరీర సత్తాలోనే జీవించే వాడట! ఇదీ సిజమైన, ఆదర్శమైన ధ్యానం. కళ్ళు తెరచి పని చేస్తున్న ఘడియల్లోకూడ ఆ అశరీర సత్తానుంచి వెలువడే ఆనంద స్పందనను అనుభూతి చెందాలి. పరిశీలన అంతర్వీక్షణగా మారాలి.

నిజంగా ప్రథమదశలో నవసాధకులు తమ ధ్యానాన్ని ఏకాంతంలో, మూసిన కళ్ళతోనే ప్రారంభించి క్రమేణ దాన్ని నిత్యజీవితంతో ముడివైచి తెరచిన కళ్ళ ధ్యానంలోకి పరిణత పరిస్తే అది ఆదర్శమైన ధ్యానం అవుతుంది!

* * *

ఆలోచించటం అంటే ఆలోచించకపోవటం నుంచి తప్పించుకోటం. కాని ఆలోచించకపోవటం అనేది మాత్రం ఆలోచించటం నుంచి తప్పించుకోటం కాదు. ఆలోచించకుండా వుండటానికంటే ఆలోచించటమే లేలిక. ఆలోచించకపోవటం

చాలా కష్టమైనపని. అందుకే ఆలోచించటం అనేది ఆలోచించకపోవటం నుంచి తప్పించుకోటం అనేది.

అందుకు వ్యతిరేకంగా, జీవించకపోవటం అనేది జీవించటంనుంచి తప్పించుకోటం అవ్వతుంది. జీవించకపోవటానికంటే జీవించటమే కష్టసాధ్యం. జీవించటాన్ని జారీ చేసేదానికంటే జీవించటాన్ని ఆపివేయటమే చాలా సులభమైన పని. అయినా, జీవులు జీవించక పోవటానికంటే జీవించటానికే ఎక్కువ ఇష్టపడతవి. జీవించటంలోవున్న గొప్ప భయం ఏమంటే ఒకనాటికి జీవించకపోవటం అనేది వస్తుందని! జీవితం తీపిగా వుంటుంది ఎందుకంటే ఈ క్షణాన అది జీనిస్తుంది కనుక. జీవితం చేదుగా వుంటుంది ఎందుకంటే ఇకముందు అది మృత్యువును తెస్తుందికనుక. మనిషి సుఖాలతో సంతృప్తిగా వున్నపుడు మృత్యువును ద్వేషిస్తాడు. జీవితాన్ని ప్రేమిస్తాడు; కాని బాధల్లో వున్నపుడు మృత్యువును ప్రేమిస్తాడు, జీవితాన్ని ద్వేషిస్తాడు. నిర్లిప్తంగా సుఖానికీ దుఃఖానికీ దూరంగా వున్నపుడు జీవితాన్నీ ప్రేమిస్తాడు, మృత్యువునూ ప్రేమిస్తాడు. దేన్ని ద్వేషించడు. అప్పుడు జీవితం నుంచి మృత్యువుకానీ, మృత్యువునుంచి జీవితం కానీ ఏదీ పలాయన మార్గంకాదు.

ఆలోచించ లేనివారు, అనుభూతి చెంద లేనివారు, సృజించలేనివారు జీవితపు మిథ్యా భాషలో మాత్రమే నివసించ యోగ్యులు. కాని అసలైన అంతరార్థంలో జీవించటం అనేది ఆలోచించటానికంటే, అనుభూతి చెందటానికంటే, సృజించటానికంటే మహత్తరమైనట్టీ, కష్టతరమైనట్టీ ప్రతిభ-ఉత్తమంగా జీవించటం తెలిసినవారికి ఉత్తమంగా మరణించటం కూడ తెలుసు.

జీవించటం అనేది మరణించటంనుంచి తప్పుకోడం కానీ, మరణించటం అనేది జీవించటం నుంచి తప్పుకోడం కానీ కారాదు. జీవితమూ మరణమూ కూడ మన భయానికీ ద్వేషానికీ గురి కాకూడదు. రెంటూ కూడ మనకు సమాన ప్రియతమలే !

*　　*　　*

పసరురంగుతో నిండిన లేత ప్రాణంతో కంపించే పచ్చికబయళ్ళు ఎంతో సమ్మోహనకరంగా వుంటవి. వాటిని చూడటానికీ, వాటిలో నడవటానికీ, వాటిమీద ధ్యానం నిలపటానికీ. ఈ పచ్చని శోభ ప్రాణమయ కోశానికి చెందింది.

ప్రతివారూ పచ్చిక బయళ్ళను ఆనందించగలరు. అవి చూచేవారి కంటికి హృదయానికీ కూడ హాయిని సవి కనుక.

అంత మనోహరంగా వుంటవి గోధుమరంగు ఇసుక ఎడారులు; అవి బంగారురంగు ఇసుకతో మండుతూ వాటి విశాలమైన హద్దులను అనంత దిగంతాల వరకూ వ్యాపింపజేసి ఒక విధమైన శూన్యాభాసను సృష్టిస్తవి. ఈ ఎండిన శూన్య శోభ అందరి హృదయాలనూ ఆనందపరచ జాలవు.ఇటువంటి ఎండు సౌందర్యం విజ్ఞానమయ, ఆనందమయ కోశాలకు చెందుతుంది. కొద్దిమంది మాత్రమే ఈ ఎండిన నీరస లావణ్యాన్ని ఆనం దించగలరు. పచ్చిక బయళ్ళలోని జీవం తన పచ్చిరూపంలో వ్యక్తమైతే ఎడార్లలోని జీవం తన పండురూపంలో వ్యక్తమవుతుంది. వికసించని హృదయాలుకూడ పచ్చిక బయళ్లను ఆనందించ గలవు కాని వికసించినవి మాత్రమే ఎడారులను ఆనందించ గలవు.

పచ్చని పచ్చికబయళ్ళు మాంసలమైన మాధుర్యాన్ని, మట్టిమీద ఆసక్తినీ, నిగ్రహం లేని ఆవేశాన్ని ప్రతిబింబిస్తవి. ఇక గోధుమరంగు ఎడా రులు లోతైన ఒక పండిన కాంతినీ, ఆత్మను

చెందిన ఒక నిర్లిప్త స్వేచ్ఛనూ, శూన్యంతో నిండిన ఒక లలితమైన ప్రేమనూ వ్యక్తపరుస్తుంది.

పచ్చని పచ్చికబయళ్లూ, గోధుమరంగు ఇసుక ఎడార్లూ కూడా వివిధదశల్లోని జీవ పరిణామాన్ని తెలిపే విశ్వసృష్టిలోని అద్భుత రూపాలు.

*　　*　　*

జీవితం అనేది నిరంతరంగా అధిగమించుతూండే ఒక విధానం. స్థూలాన్ని అధిగమించటం, హ్రస్వాన్ని అధిగమించటం, తాత్కాలికాన్ని అధిగమించటం, ఇంద్రియ గ్రాహ్యాన్ని అధిగమించటం.

వాస్తవవాది రూపాన్ని ఆనందిస్తాడు; ఆదర్శవాది సగం రూపాన్ని ఆనందిస్తాడు; కల్పనావాది రూపాతీతాన్ని ఆనందిస్తాడు.

వాస్తవవాది అవ్యవస్థను అధిగమించి నిజమైన రూపాన్ని చూస్తాడు. ఆదర్శవాది నిజమైన రూపాన్ని అధిగమించి మారిన రూపాన్ని చూస్తాడు; ఇక కల్పనావాది నిజమైన రూపాన్నీ మారిన రూపాన్నీకూడ అధిగమించి రూపంలేని రూపాన్ని తిలకిస్తాడు.

ఇంద్రియగ్రాహ్య సత్యాలన్నీ కాలదేశ బంధనాలతో పరిమితమై వుంటాయి. ఇవి మార్పుకూ, నాశానికీ, మృత్యువుకూ లోబడి వుంటవి. ఇంద్రియ గ్రాహ్యాలను అధిగమించటం అంటే లోకోత్తరాన్ని అందుకోటమే. ఇది మార్పుకూ, నాశానికీ, మృత్యువుకూ అతీతంగా వుండటం మూలంగా బాధలనుంచీ వ్యధలనుంచీ విముక్తంగా వుంటుంది. అధిగమనమార్గం అనేది నిరంతర శాంతికీ, చిరంతన ఆనందానికి మార్గం; ఇదే మానవ జీవితపు చరమలక్ష్యం.

* * *

పనిలో వాస్తవవాదం, ఆలోచనలో ఆదర్శవాదం, ఈ రెండూ కలసి జీవితంలో ఒక సుందర సమన్వయాన్ని సృష్టిస్తవి. నిజానికి ఆలోచన ఆదర్శవాదానికీ, పని వాస్తవవాదానికీ చెందుతవి. వాస్తవవాదం దృశ్యమానమైంది. పని కూడ దృశ్యమానమే. కనుక పని అనేది వాస్తవవాదం. ఆదర్శవాదం అదృశ్యమైంది; ఆలోచనకూడ అదృశ్యమైంది; కనుక ఆదర్శం అనేది ఆదర్శవాదం.

ఆలోచనలోనూ పనిలోనూ వైఫల్యం ప్రవేశించి నపుడు వ్యతిరేకతలు సంభవిస్తవి. విఫల మైనప్పుడు ఆలోచన వాస్తవ వాదంలోకి, పని ఆదర్శవాదంలోకి మారుతవి. ఈ విధంగా మిథ్యా లోచనా, మిథ్యాకార్యమూ ప్రత్యక్షమవుతవి.

* * *

ఇతర్లను తెలుసుకోటం, ఇతర్లను చూడటం, ఇతర్లను ప్రేమించటం అనేది గొప్ప ఆనందం. అయితే, ఇతర్ల చేత తెలుసుకోబడటం, ఇతర్ల చేత చూడబడటం, ఇతర్ల చేత ప్రేమించ బడటం, అనేది అంతకంటే గొప్ప ఆనందం. మనం ఇతర్లను ప్రశంసించినపుడు ప్రశంసించినవారి కంటే ప్రశంసించబడిన వారే ఎక్కువ ఆనందం పొందు తారు.

ఇతర్లను తెలుసుకోటంలో, చూడటంలో, ప్రేమించటంలో మనం మన అహాన్ని వదిలేస్తాం కాని ఇతర్ల చేత తెలుసుకోబడటంలో, చూడ బడటంలో, ప్రేమించబడటంలో మన అహాన్ని ఉంచుకొంటాం; అందుకే కర్మణ్య స్థానంలో మనం ఎక్కువ ఆనందం పొందుతాం. కర్తృత్వ

స్థానంలో మనం ఇస్తాం, కర్మణ్యస్థానంలో మనం ఇవ్వబడతాం, లేక తీసుకొంటాం. తీసుకోటం స్వార్థం;ఇవ్వటం నిస్వార్థం;కనుకనే రెండోదానిలో కంటే మొదటిదానిలోనే ఎక్కువ ఆనందం !

*　　*　　*

పాత సంవత్సరం అంతరించటం అంటే క్రొత్త సంవత్సరం ప్రారంభించటమే. పాత సంవత్సరానికి ప్రారంభమూ లేదు, క్రొత్త సంవత్సరానికి అంతమూ లేదు. పాత సంవత్సరం ప్రారంభించినపుడు అది క్రొత్తదే. అదే విధంగా క్రొత్త సంవత్సరం అంతరించినపుడు అది తిరిగి పాతదే అవుతుంది. ఈ విధంగా చూస్తే అంతం అనేది పాత సంవత్సరానికీ, ప్రారంభం అనేది క్రొత్త సంవత్సరానికీ చెందివుంటవి.

భూత భవిష్యత్తుల మధ్య వుంటుంది వర్తమానకాలం. అయితే పాతా క్రొత్తల మధ్య ఏముంటుందీ పాతా క్రొత్తలమధ్య ఉండేదాన్ని పిలవటానికి ఒక పేరు అంటూ లేదేమో అని పిస్తుంది. దాన్ని 'సంధి' అనవచ్చునేమో !

పాత సంవత్సరంలోని చేదు జ్ఞాపకాల స్థానాన్ని కొత్త సంవత్సరంలోని తీయని ఆశలతో నింపవచ్చు. కాని కొత్త సంత్సరంలో చేదు ఆశలు కనుపిస్తే వాటి స్థానాన్ని పాత సంవత్సరంలోని తీయని జ్ఞాపకాలతో నింపవచ్చు. పాత సంవత్సరం ఏదీకూడ కేవలం అన్నీ చేదు జ్ఞాపకాలను కానీ, కేవలం అన్నీ తీపి జ్ఞాపకాలను కానీ కలిగుండదు. అదే విధంగా ఏ కొత్త సంవత్సరం కూడ కేవలం అన్నీ చేదు ఆశలను కానీ, కేవలం అన్నీ తీపి ఆశలను కానీ కలిగుండదు.

పాత సంవత్సరం అనేది ఒక నగ్నమూర్తి; అందులోని ప్రతి రహస్యపు అవయవంకూడ గోచరిస్తుంటుంది. కాని క్రొత్త సంవత్సరం మాత్రం అజ్ఞాతమైన గుప్త భవిష్యత్ వస్త్రాల క్రింద సంపూర్ణంగా దాగివుంటుంది! అందుకే అజ్ఞాతభవిష్యత్ అనేది!!కొందరికి జ్ఞాత భవిష్యత్ కూడవుంటుంది!!!

Check List

Book Number	TRBOTA131	Date	16/02/22
Front Cover	Yes	Back Cover	NO
Blank Pages	CI, II,		
Missing Pages			
Prepared By	Swathi	Cutting By	Swathi
Scanned By	mahisha	Pages	85